ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 03.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 342 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



యుద్ధం కారణంగా కీలక టోర్నీకి సింధూ దూరం 10

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో
కంట్రోల్ రూం

- యుద్ధం కారణంగా పశ్చిమాసియాలోని వివిధ దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులు
- వారి బంధువుల సౌకర్యార్థం కంట్రోల్ రూం ఏర్పాటు
- ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారుల వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో



హైదరబాద్, మార్చి 2: యుద్ధం కారణంగా పశ్చిమాసియాలోని వివిధ దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకుపోయిన తెలంగాణ వాసులు, వారి బంధువుల సౌకర్యార్థం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో 24/7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే తాము విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖతో పాటు ఆయా దేశాల్లోని మన రాయబార కార్యాలయాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నట్లు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులు తెలిపారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ప్రస్తుతం ఇరాన్, గల్ఫ్ తదితర ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

24×7 కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు:

వందన బరువా :	+91 9871999044
సీహెచ్. చక్రవర్తి :	+91 9958322143
జావేద్ హుస్సేన్	: 9910014749
రక్షిత్ నాయక్ :	+91 9643723157

దుబాయ్‌లో చిక్కుకుపోయిన
మంత్రి తుమ్మల



పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్ లో చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు.

...:: 3లో



భగ్గుమంటున్న పశ్చిమాసియా

అరబ్ దేశాలను టార్గెట్ చేసిన ఇరాన్
ఇజ్రయేల్, అమెరికా మిత్రదేశాలపై బాంబుల వర్షం

- బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, యుఏఈ దేశాలపై క్షిపణులతో దాడులు
- సౌదీ అరామ్‌కో ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ దాడి
- ఒమన్ లో ఆయిల్ ట్యాంకర్‌పై దాడి.. భారతీయుడి మృతి
- నెతన్యాహు కార్యాలయంపై దాడి చేశాం: ఇరాన్ ఐఆర్జీసీ ప్రకటన
- ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా కీలక నేత మృతి
- ఇరాన్‌లో 555 మంది పౌరులు మృతి
- అమెరికాతో చర్చలకు ఇరాన్ నిరాకరణ
- యుద్ధం ఐదు వారాలపాటు కొనసాగుతుంది: ట్రంప్
- ఇరాన్‌లో చిక్కుకున్న భారత విద్యార్థులు
- స్వదేశానికి తరలించాలని భారత ప్రభుత్వానికి అభ్యర్థన

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియా భగ్గుమంటోంది. అమెరికా మిత్ర దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. చమురు శద్ధి కర్మాగారాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపిస్తోంది. ఇరాన్ కు చైనా మద్దతు ప్రకటించింది. యూరోపియన్ యూనియన్ దేశాలు అమెరికాకు మద్దతుగా నిలుస్తున్నాయి. ఇక యుద్ధం లెబనాన్, ఇరాక్ వరకు యుద్ధం విస్తరించింది. ఈ నేపథ్యంలో ఇరాన్ దాడులతో షాకైన అరబ్ దేశాలు.. అమెరికా, ఇజ్రాయేల్‌తో కలిసి యుద్ధంలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఈ విషయాన్ని సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ లయన్స్ రోర్' తీవ్రరూపం దాల్చేలా కనిపిస్తోంది. టెహ్రాన్‌పై క్షిపణుల వర్షం కురిపించి ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అంతమొందించడంతో ఇరాన్.. ప్రతీకార దాడులను తీవ్రం చేయడమే అందుకు కారణం. అమెరికా, ఇజ్రాయేల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ వ్యూహాత్మకంగా అరబ్ దేశాలను లక్ష్యంగా చేసుకుంది. ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలను నేలకూల్చడం కోసం యుద్ధవిమానాలు, క్షిపణులతో దాడులకు తెగబడింది. తమ భూభాగంపై ఇరాన్ దాడులతో కంగుతిన్న అరబ్ దేశాలు

...:: మిగతా 2లో



యుద్ధానికి సన్నద్ధం కండి

- మోడీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయి
- బీజేపీ ప్రభుత్వ చర్యలతో దేశంలో యుద్ధం వచ్చే అవకాశం
- దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పైనే ఉంది
- అహింస, శాంతి, సత్యాన్వేషణ కాంగ్రెస్ మూల సిద్ధాంతాలు
- అహంకారాన్ని విడనాడి పార్టీ, ప్రజల కోసం పని చేయండి
- మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- ముగిసిన డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరబాద్, మార్చి 2: యుద్ధానికి సన్నద్ధం కావాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వికారాబాద్ హరిత రిసార్ట్స్‌లో జరిగిన డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడిన రాహుల్ గాంధీ యుద్ధానికి సిద్ధం కావాలని

...:: మిగతా 2లో

రాహుల్‌ని ప్రధాని చేయడమే లక్ష్యం

- పార్టీలో కష్టపడి పనిచేసిన వారికే అవకాశాలు
- డీసీసీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన పీఏసీ సమావేశం
- ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై చర్చ
- రాజ్యసభ సభ్యుల ఎంపికపై కీలక కసరత్తు
- తెరపైకి పలువురు సీనియర్ల పేర్లు
- రెండు రోజుల్లో అధికారికంగా పేర్లు ప్రకటన?
- బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్డనెన్స్, ప్రయివేటు బిల్లు
- పీఏసీ సమావేశంలో రాహుల్ గాంధీ సూచన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరబాద్, మార్చి 2: రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

వికారాబాద్ జిల్లాలో జరిగిన తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో దాదాపు రెండు గంటల పాటు మాట్లాడిన ఆయన, పార్టీ సిద్ధాంతాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని వివరించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎలా అవకాశాలు లభిస్తాయో తెలిపారు. 19 ఏళ్ల కిందట జడ్పీటీసీగా ప్రారంభమైన తన రాజకీయ ప్రయాణం ముఖ్యమంత్రి పదవికి చేరిందని సీఎం తెలిపారు. ప్రజా సమస్యలపై గళమెత్తినందుకు తనపై కేసులు నమోదయ్యాయని, నిన్న కూడా కోర్టుకు హాజరైనట్లు చెప్పారు. దేశం కోసం, పార్టీ కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ప్రతి నాయకుడు పని చేయాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్ల పోరాటాల ఫలితంగా రాహుల్ గాంధీ లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఎదిగారని పేర్కొన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి ఫలితం తప్పక లభిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్ల కోసం ప్రయివేటు బిల్లు

వికారాబాద్‌లోని అనంత పద్మనాభ ఆర్ట్స్ కళాశాలలో దాదాపు 45 నిమిషాల

...:: మిగతా 2లో



తెలంగాణ యువతను దగా చేశారు

- రెండు లక్షల ఉద్యోగాల హామీని రాహుల్ నిలబెట్టుకోవాలి
- హామీ నేరవేర్చండని అడిగితే పోలీసులతో అణిచివేస్తారా?
- నిరుద్యోగులను ముందస్తు అరెస్టు చేయటం దుర్మార్గం
- 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలి
- రాహుల్ జీ ఇది పోరాటాల పురిటిగడ్డ గుర్తు పెట్టుకోండి
- రాహుల్ గాంధీని నిలదీసిన జాగృతి అధ్యక్షురాలు కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 2: తెలంగాణలో అధికారంలోకి వస్తే ఏడాది లో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ తెలంగాణ యువతను పచ్చి దగా చేశారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణ కోసం హైదరాబాద్ కు వచ్చిన ఆయనను నిలదీశారు. మిమ్మల్ని నమ్మి ఓటు వేసిన నిరుద్యోగుల గోడు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కు ఓటు వేసినందుకు వారంతా శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీ పార్టీ గద్దెనెక్కడానికి నిచ్చెనమెట్లుగా నిలిచిన యువత ఆశలను, ఆకాంక్షలను చిదిమేశారంటూ రాహుల్ గాంధీపై మండిపడ్డారు. యూత్ డిక్లరేషన్ ను బోగస్ చేశారని, జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ అంటనే మోసం, వంచన అన్న దాన్ని మరోసారి నిరూపించారన్నారు. ఉద్యోగాలిస్తామన్న మీ మాటను నిలబెట్టుకోమంటే పోలీసులతో అణిచివేస్తారా? రాహుల్ జీ ఇది పోరాటాల

...:: మిగతా 2లో

ఎస్సీ ఉప కులాలకు

రిజర్వేషన్ ఫలాలు దక్కాలి

- పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలి
- ఎస్సీ రిజర్వేషన్ల పెంపునకు దళిత సంఘాలతో కలిసి జాగృతి ఉద్యమం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఎస్సీ ఉప కులాల నేతలతో సమావేశం

...:: 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్- 6.28 (మంగళవారం సాయంత్రం)

సహర్- 5.10 (బుధవారం ఉదయం)



భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ

పశ్చిమ ఆసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులపై భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ చర్చించింది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరిలో రెండు రోజుల పర్యటన తర్వాత రాత్రి తొమ్మిదిన్నర గంటలకు ఢిల్లీ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

9



గల్ఫ్ లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులు

విదేశాల్లో చదువుకుంటున్న మొత్తం భారతీయ విద్యార్థుల్లో పావు వంతు మంది గల్ఫ్ దేశాల్లోనే ఉన్నారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతున్న దరిమిలా ఈ విద్యార్థులు భద్రతాపరమైన ముప్పును కూడా ఎదుర్కొంటున్నారు.

9



నకిలీ ఏఐ తీర్పులతో నిర్ణయాలా..?

'ఉనికిలో లేని ఏఐ ఆధారిత నకిలీ తీర్పులతో కోర్టులు నిర్ణయాలు తీసుకోవటం తప్పు మాత్రమే కాదు. ఇది తీవ్రమైన దుష్ప్రవర్తన, చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుంది' అంటూ సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది.

9

రాష్ట్రీయం

తెలంగాణ యువతను దగా చేశారు

మొదటిపేజీ తరువాయి

పురిటిగడ్డ గుర్తు పెట్టుకోండని కవిత హెచ్చరించారు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోతే...నిరుద్యోగులంతా కాంగ్రెస్ కచ్చితంగా కర్రుకాల్చి వాత పెడతారని అన్నారు.

ముందస్తు అరెస్టులు దుర్మార్గం

రాహుల్ గాంధీని అడ్డుకుంటారన్న నెపంతో తెలంగాణలో పోలీసులు ముందస్తు అరెస్టేలు చేయడాన్ని కల్వకుంట్ల కవిత ఖండించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సింది పోయి, అర్ధరాత్రి నిరుద్యోగులను, జాగృతి కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయటం దుర్మార్గమని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అక్రమంగా అరెస్ట్ చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలి

- **పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలి**
- **ఎస్సీ రిజర్వేషన్ల పెంపునకు దళిత సంఘాలతో కలిసి జాగృతి ఉద్యమం**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**
- **ఎస్సీ ఉప కులాల నేతలతో సమావేశం**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 2: ఎస్సీల్లో ఉపకులాలకు కూడా రిజర్వేషన్ ఫలాలు దక్కాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల అన్నారు. ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగాల్లో మాత్రమే కాకుండా రాజకీయాల్లోనూ వారికి రిజర్వేషన్లు దక్కాలన్నారు. సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాల్సిన అవసరముందన్నారు. అదే విధంగా పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్టు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టం అయిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే క్రమంలో కేంద్రం చేపట్టే జనగణన లెక్కల కోసం ఎదురుచూస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. కేంద్ర జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. ఐతే అందుకు అనుగుణంగా రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీ లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దళిత సంఘాలతో కలిసి జాగృతి పోరాటం చేస్తుందని చెప్పారు. ఎస్సీ ఉప కులాల్లో కొన్ని కులాలకు క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్

ప్రతిపక్షం, మంచిర్యాల, మార్చి 2: చెన్నూరు మాజీ టిఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు సోమవారం మంచిర్యాల కోర్టు షరతులతో కూడిన బెయిల్ ను మంజూరు చేసింది. సుమన్ మంచిర్యాల కోర్టుకు హాజరుకానున్నారని తెలియడంతో అభిమానులు మంచిర్యాల కోర్టు వద్ద పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోర్టు బెల్ మంజూరు అయినదని సంబంధిత న్యాయవాది తెలియజేయడంతో అభిమానులు బాణసంచా కాల్చి మిఠాయి పంపిణీ చేశారు. కాగా ఇంకో కేసులో తిరిగి ఆదిలాబాద్ కోర్టుకు వెళ్ళనున్నారు. మంగళవారం అదిలాబాద్ కోట నుండి బయటకు రానున్నారని న్యాయవాదులు తెలిపారు. ప్రతి ఆదివారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్లో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హాజరవుతూ ఉండాలని చరిత్రతో కూడిన బెల్లు మంజూరు చేసినట్లుగా సంబంధిత న్యాయవాదులు పేర్కొన్నారు.






రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు

- **పారిశుద్ధ్యం, మంచినీరు, విద్యుత్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి.**
- **ఇస్నాపూర్ మున్సిపాలిటీ తొలి పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 2 : నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీని ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులతో కలిసి రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లగ్దారం వార్డు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సుమలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన పురపాలిక తొలి పాలకవర్గ సమావేశానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే చెరు . ఈ సందర్భంగా నూతన పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్ నియోజకవర్గంలో నూతనంగా 5 మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి మున్సిపల్ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని ,ప్రతి వార్డు పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల కోసం వీటిని కేటాయించినట్లు పేర్కొన్నారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే ఐదు సంవత్సరాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని సూచించారు.రాబోయే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని మంచినీరు, విద్యుత్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి వార్డుని అభివృద్ధి లో ముందుకు తీసుకుపోవాలని కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవి రెడ్డి, కమిషనర్ వెంకట కిషన్ రావు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





అమెరికా-ఇజ్రాయెల్ మానవత్వ విలువలను పట్టించుకోవట్లేదు. ఆస్పత్రులు, దేశ భవిష్యత్ అయిన స్కూళ్లను టార్గెట్ చేసుకున్నారు. రోగులు, పిల్లలపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య. ప్రపంచమంతా దీన్ని ఖండించాలని, తాను దేశం తరపున నిలబడతాను. ఇరాన్ ఇలాంటి నేరాలకు లొంగిపోదని, మౌనంగా ఉండదు.

- ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

భగ్గుమంటున్న పశ్చిమాసియా

మొదటిపేజీ తరువాయి

ప్రతీకారానికి సిద్ధమవుతున్నాయని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. 'ఇది మాకు అతిపెద్ద ఆశ్చర్యం' అని ఆయన పేర్కొన్నారు. సోమవారం సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'ఇరాన్ సైన్యం అరబ్ దేశాలను టార్గెట్ చేసింది. బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.. దేశాలపై క్షిపణులతో దాడులకు తెగబడింది. హోటళ్లు, ఇళ్లపై ఇరాన్ బాంబులు వేసింది. దాంతో.. ఆగ్రహించిన ఈ దేశాలు ఇరాన్‌కు బుద్ధి చెప్పాలనుకుంటున్నాయి. అందులో భాగంగానే మాతో కలిసి యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాయి. ఇదంతా మాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే.. 'మేము ఈ యుద్ధాన్ని ఆరంభించాం' అని వారితో చెప్పాం. అందుకు వారు.. 'మేము కూడా పోరాడుతాం' అని అంటున్నారు. వారు చాలా ఆగ్రహావేశాలతో యుద్ధం చేస్తున్నారు. కానీ, ఈ యుద్ధంలో అరబ్ దేశాలు పాల్గొనేది తక్కువే' అని వెల్లడించారు. సుప్రీం లీడర్ ఖమేనీని హతం చేసిన అనంతరం ఆపరేషన్ లయన్స్ రోర్ విజయవంతమైందని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తమ విజయాన్ని ఎవరూ నమ్మలేకపోతున్నారని ఆయన తెలిపారు. తమ సైనిక దాడుల్లో ఇరాన్‌కు చెందిన 48 మంది నాయకులు హతమయ్యారని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. ఒక్క షాట్‌లోనే ఖమేనీ సహా పలువురు కీలక నేతలను అంతమొందించామని ఆదివారం ట్రంప్ పేర్కొన్నారు.

అమెరికాతో చర్చలకు ఇరాన్ నిరాకరణ

పశ్చిమాసియాలో పరిస్థితి భీకరంగా మారింది. అమెరికాఇజ్రాయెల్ దళాలు శనివారం ఇరాన్‌పై దాడి చేసిన నేపథ్యంలో పరిస్థితి అదుపు తప్పింది. అయితే ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్.. గల్ఫ్ దేశాలపై కక్ష కట్టింది. దీంతో ఇరాన్ ఏకాకిగా మారినట్లు అయ్యింది. ప్రతిదాడులకు దిగిన ఇరాన్‌ను వదిలిపెట్టేది లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికాతో చర్చలు నిర్వహించేందుకు ఇరాన్ నిరాకరించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై జరిగిన దాడుల్లో యూకే పాత్ర లేదని ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. అయితే అమెరికా చేసిన ఓ అభ్యర్థనకు బ్రిటన్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇరాన్ క్షిపణలను తిప్పికొట్టేందుకు బ్రిటీష్ బేస్‌ను వాడుకోవాలని అమెరికా ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్ స్పందించారు. కాగా, అమెరికాఇజ్రాయల్ నిర్వహించిన దాడులను రష్యా ఖండించింది. రాజకీయ హత్యలకు పాల్పడడం సరికాదు అని రష్యా పేర్కొన్నది. మరోవైపు ఇవాళ అమెరికా జరిపిన దాడుల్లో.. టెహ్రాన్‌లో ఉన్న రష్యా టుడే కార్యాలయం సమీపంలో ఓ బాంబు పడినట్లు తెలుస్తోంది. దీంతో ఆర్టీ అరబిక్ ఆఫీసులో ఉన్న సిబ్బందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

యుద్ధం ఐదు వారాలపాటు కొనసాగుతుంది: ట్రంప్

చర్చల ప్రసక్తి లేకపోతే.. ఇరాన్‌తో యుద్ధం కనీసం ఐదు వారాలపాటు కొనసాగే అవకాశం ఉన్నదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంచనా వేశారు. ఖమేనీ ప్రోద్బలంతో తనపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయన్న ఆయన.. తాను మాత్రం మొదటి ప్రయత్నంలోనే ఖమేనీ కథను కంచికి చేర్చినట్టు చెప్పుకొచ్చారు. ఇరాన్‌పై తాము చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' క్లిష్టమైనదైనప్పటికీ, పూర్తిస్థాయిలో దాడులు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. యుద్ధ తీవ్రతను ఇలాగే కొనసాగించడం తమకు, ఇజ్రాయెల్‌కు పెద్ద కష్టమేమీ కాదన్నారు. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకూ ముగ్గురు అమెరికా సైనికులు మరణించినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది.

నెతన్యాహు కార్యాలయంపై దాడి చేశాం: ఇరాన్ ఐఆర్జీసీ ప్రకటన

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సోమవారం తెలిపింది. 'ఆశ్చర్యకరమైన' క్షిపణి దాడి చేసినట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ వైమానిక దళ కమాండర్ ఉన్న ప్రదేశాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని మిసైల్ ఎటాక్ చేసినట్లు వెల్లడించింది. తమ దాడుల తర్వాత నెతన్యాహుకు సంబంధించిన సమాచారం అస్పష్టంగా ఉన్నదని ఇరాన్ ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇజ్రాయెల్ దీనిపై



ఇంకా స్పందించలేదు.

ఇరాన్ అణుకేంద్రాలకు నష్టం జరగలేదు: ఐఏఈఏ

ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ , టెహ్రాన్ రీసర్చ్ రియాక్టర్ తో పాటు ఇతర అణు కేంద్రాలకు ఎటువంటి డ్యామేజ్ కాలేదని ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ అధిపతి రఫేల్ గ్రోసీ పేర్కొన్నారు. శనివారం అమెరికాఇజ్రాయిల్ దళాలు ఒక్క రోజే ఇరాన్‌పై సుమారు 2000 బాంబులతో దాడి చేశాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న అణు కేంద్రాలకు ఏదైనా నష్టం జరిగిందేమో అన్న భయాందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ సందర్భంగా ఐఏఈఏ హెచ్ రఫేల్ గ్రోసీ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇరాన్ న్యూక్లియర్ రెగ్యులేటరీ అథారిటీతో సంప్రదించే ప్రయత్నం చేస్తున్నామని, కానీ ఇప్పటి వరకు ఎటువంటి స్పందన రాలేదని ఐఏఈఏ పేర్కొన్నది. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ సైనిక ఆపరేషన్స్ వల్ల న్యూక్లియర్ సైట్లకు ఎటువంటి ప్రమాదం జరగకుండా చూసుకోవాలని రఫేల్ గ్రోసీ పిలుపునిచ్చారు. బహ్రెయిన్, ఇరాక్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా దేశాల్లో ఉన్న అణు కేంద్రాలకు సమస్య లేదన్నారు. అయితే ఆదివారం నటాంజ్ న్యూక్లియర్ కేంద్రంపై దాడి జరిగినట్లు ఐఏఈఏకు చెందిన ఇరాన్ అంబాసిడర్ రేనా నజాఫి పేర్కొన్నారు. కానీ ఆ ఘటనకు చెందిన పూర్తి వివరాలను ఆయన వెల్లడించలేదు. అమెరికాఇజ్రాయెల్ దళాల దాడుల్లో ఇరాన్‌లోని కేంద్రాలకు ఏమీ కాలేదని యూఎన్ పేర్కొన్నది. పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని, అన్ని దేశాలు సంయమనం పాటించాలని గ్రోసీ అన్నారు.

సౌదీ అరామ్‌కో ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ దాడి

సౌదీ అరేబియాలో కీలకమైన అరామ్‌కో ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. దీంతో రాస్ తనూరాలోని చమురు శుద్ధి కర్మాగారం నుంచి దట్టంగా పొగలు ఎగసిపడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ సంఘటన ప్రపంచ ఇంధన మార్కెట్ పై తీవ్ర ప్రభావం చూపింది. ముడి చమురు ధరలు 9.32 శాతం మేర పెరిగాయి. కాగా, అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో ప్రపంచంలోని రోజువారీ చమురు రవాణాలో సుమారు 20 శాతం మేర సాగే హార్ముజ్ మార్గంపై ప్రభావం పడింది. ఇరుకైన ఈ మార్గాన్ని ఇరాన్ అధికారికంగా మూయలేదు. అయినప్పటికీ భద్రత దృష్ట్యా హార్ముజ్ జలసంధికి ఇరువైపులా పలు ట్యాంకర్లు, కార్గో షిప్‌లు నిలిచిపోయాయి. ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన కారిడార్‌లలో ఒకటైన ఈ మార్గంలో చమురు రవాణాకు అడ్డంకి వల్ల ఇప్పటికే ప్రపంచ ఇంధన మార్కెట్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నది.

ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా కీలక నేతమృతి

ఇరాన్ కు మద్దతుగా హెజ్బొల్లా గ్రూప్ ఇజ్రాయెల్ పై దాడులకు పాల్పడటంతో లెబనాన్ లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్ తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బొల్లాకు చెందిన కీలక నేత మహ్మద్ రాడ్ మృతిచెందినట్లు సౌదీ వార్తా సంస్థ అల్‌హదత్ పేర్కొన్నది. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై సోమవారం ఇజ్రాయెల్ రక్షణ దళం వైమానిక దాడులు జరిపిందని, ఆ దాడుల్లో లెబనాన్ పార్లమెంట్‌లోని హెజ్‌బొల్లా బ్లాక్ అధిపతి మహ్మద్ రాడ్ మృతి చెందారని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. హెజ్బొల్లాకు చెందిన మరికొందరు ఉన్నతాధికారులు కూడా తమ దాడుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అయితే వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇదిలావుంటే ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 31 మంది మృతిచెందగా.. 149 మంది గాయపడినట్లు లెబనాన్ వెల్లడించింది. హెజ్బొల్లా నేతలు లెబనాన్ రక్షణ కంటే ఇరాన్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని, వారి చర్యలకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఐడీఎఫ్ నార్తర్న్ కమాండ్ చీఫ్ రఫీ హెచ్చరించారు. మొదట హెజ్బొల్లా తమపై రాకెట్ దాడులకు పాల్పడడంవల్లే ప్రతిదాడులు చేస్తున్నామని చెప్పారు.

ఒమన్ లో ఆయిల్ ట్యాంకర్‌పై దాడి.. భారతీయుడి మృతి

ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. ఈ దాడిలో భారతీయుడైన మెరైన్ సిబ్బంది మరణించినట్లు ఒమన్ ధృవీకరించింది. ఆయిల్ ట్యాంకర్‌లోని మిగతా సిబ్బందిని రెస్క్యూ చేసినట్లు పేర్కొంది. అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ఇరాన్ ధీటుగా స్పందిస్తున్నది. ప్రతిదాడులకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో ఒమన్ సముద్ర జలాల్లో ఉన్న మార్షల్ దీవులకు చెందిన ఆయిల్ ట్యాంకర్ ఎంకెడీ వియోమ్‌పై మార్చి1న డ్రోన్ దాడి జరిగింది. ప్రధాన ఇంజిన్ గదిలో పేలుడు సంభవించడంతో మంటలు చెలరేగాయి. కాగా, ఆ ఆయిల్ ట్యాంకర్‌లో 21 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీయులు, ఒకరు ఉక్రేనియన్. అయితే డ్రోన్ బాంబు దాడి వల్ల జరిగిన పేలుడులో భారత్‌కు చెందిన ఒక మెరైన్ సిబ్బంది మరణించినట్లు ఒమన్ అధికారులు సోమవారం ధృవీకరించారు. మృతుడి వివరాలను వెల్లడించలేదు. ప్రాణాలతో బయటపడిన మిగతా వారిని పనామాకు చెందిన కార్గో షిప్‌లోకి తరలించినట్లు వివరించారు.

ఇరాన్‌లో 555 మంది మృతి

అమెరికా, ఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో సుమారు 555 మంది మృతిచెందినట్లు ఇరాన్ రెడ్ క్రిసెంట్ పేర్కొంది. శనివారం అకస్మాత్తుగా అమెరికాఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై విరుచుకుపడ్డ విషయం తెలిసిందే. ఆ వైమానిక దాడుల వల్ల ఇరాన్‌లోని సుమారు 131 నగరాల్లో ప్రభావం పడినట్లు ఇరాన్ తెలిపింది. దేశానికి చెందిన 555 మంది మరణించారని టెలిగ్రాం పోస్టులో ఇరాన్ పేర్కొన్నది. అయితే పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయి. కొన్ని దేశాలు అమెరికాఇజ్రాయిల్ వైఖరిని ఖండించగా, మరికొన్ని దేశాలు ఆ దాడులను సమర్థించాయి. అయితే కీలకమైన జర్మనీ ప్రస్తుతం అమెరికాఇజ్రాయెల్ దళాలకు అండగా నిలవనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇరాన్ తమ దాడుల్ని ఆపకుంటే, అప్పుడు అమెరికా దళాలతో జోడీ కట్టే అవకాశాలు ఉన్నట్లు జర్మనీ వర్గాలు చెబుతున్నాయి. ఇజ్రాయెల్ ఆర్మీ రేడియోతో జర్మనీ సైనిక వర్గాలు ఈ విషయాన్ని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ వైఖరిని ఖండిస్తూ ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ గత రాత్రి ప్రకటన జారీ చేశాయి. తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు, గల్ఫ్ మిత్రులను రక్షించుకునేందుకు, అవసరమైతే ఇరాన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఆ దేశాలు వార్నింగ్ ఇచ్చాయి.

ఇరాన్‌లో చిక్కుకున్న భారత విద్యార్థులు

ఇరాన్‌లో ఉన్న భారతీయ విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇస్ఫహాన్ యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పరిధిలో చదువుతున్న పలువురు విద్యార్థులు అక్కడ నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తమను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు లేదా స్వదేశానికి తరలించాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. అక్కడి పరిస్థితిపై విద్యార్థిని ఫాతిమా మాట్లాడుతూ.. 'ప్రస్తుతం ఇక్కడ 25 నుంచి 30 మంది భారతీయ విద్యార్థులం చిక్కుకుపోయాం. మా చుట్టూ పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. అవి క్యాంపస్‌కు ఎంత దూరంలో జరుగుతున్నాయో తెలియకపోయినా, చాలా దగ్గరగా అనిపిస్తోంది. డార్మిటరీల్లో ఉన్నా మాకు రక్షణ ఉన్నట్లు అనిపించడం లేదు' అని ఆవేదన వ్యక్తంచేశారు. డార్మిటరీలను ఖాళీచేసి వేరే చోటికి వెళ్లాలని వేధిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. బయట షాపులు మూసివేయడం, ఆన్‌లైన్ డెలివరీలు నిలిచిపోవడంతో ఆహారం, నిత్యావసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

యుద్ధానికి సన్నద్ధం కండి

మొదటిపేజీ తరువాయి

పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలు అహింస, శాంతి, సత్యాన్వేషణ అని స్పష్టం చేసిన ఆయన, ఈ సిద్ధాంతాల ఆచరణ కోసం ప్రతి నాయకుడు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సమానత్వానికి ప్రతీక అని పేర్కొంటూ, కుల, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా అందరినీ గౌరవిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. పేద,ధనిక తారతమ్యాలు లేకుండా సమాజంలోని ప్రతి వర్గానికీ అండగా నిలవడం కాంగ్రెస్ ధ్యేయమని చెప్పారు. "అహంకారాన్ని విడనాడాలి. పార్టీ ప్రజల కోసం పని చేయాలి. ప్రజలు పార్టీకి బలం కావాలి. పార్టీ ప్రజలకు బలం కావాలి." అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రజల ఆశయాలను ప్రతిబింబించే విధంగా కార్యాచరణ ఉండాలని సూచించారు. పార్టీ ఎన్నికల గుర్తు 'చేయి గుర్తు' అభయ ముద్రకు ప్రతీక అని, ప్రపంచంలోని అన్ని మతాల చిహ్నాల్లోనూ అభయ ముద్రకు ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ సిద్ధాంతమని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీలో మహిళలకు గౌరవం, ప్రాధాన్యత తప్పనిసరిగా ఇవ్వాలని స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్షులు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తే వారి భవిష్యత్తును తాను చూసుకుంటానని రాహుల్ హామీ ఇచ్చారు. "మీ పని విధానం ప్రజల కోసం ఉండాలి. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల విశ్వాసం పెరగాలి." అని చెప్పారు.

కాంగ్రెస్ అంటే శాంతి, అహింస..

కాంగ్రెస్ అంటే శాంతి, అహింస, సత్యవాక్కు అని పేర్కొంటూ ప్రజల సమ్మతితోనే అధికారంలోకి రావాలనే ధ్యేయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో బీజేపీ ద్వేష రాజకీయాలతో విభేదాలు సృష్టించి అధికారంలోకి రావాలని చూస్తోందని విమర్శించారు. ఆగడాలను అడ్డుకొని దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పైనే ఉందన్నారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ, ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా, అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు .

మార్షల్ ఆర్ట్స్ చేస్తూ రాహుల్ క్లాస్

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ చేస్తూ డీసీసీ అధ్యక్షులకు క్లాస్ చెప్పారు. రాహుల్. జియు జిట్సు అనే మార్షల్ ఆర్ట్‌లో మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఐడియాలజీపై క్లాస్ చెప్పారు. నాయకులు తమ అహంకారాన్ని పక్కన పెట్టి పని చేయాలని రాహుల్ సూచించారు. పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు.. మరో పదిమందిని తయారు చేయాలని, పని చేస్తున్న వారిని గుర్తించాలని రాహుల్ గాంధీ వెల్లడించారు. పాకిస్తాన్‌కు చైనా మద్దతు ఇస్తోందని.. ఇరాన్ వెనక చైనా, రష్యా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ పూర్తిగా సరెండర్ అయ్యారని, ట్రంప్‌కు వ్యతిరేకంగా మోదీ పని చేయలేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

రాహుల్‌ని ప్రధాని చేయడమే లక్ష్యం

పాటు ఇరు రాష్ట్రాల్ల పీఏసీ సభ్యులతో రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్, బిల్లులు ఆమోదం పొందేందుకు కేంద్రంలో ప్రయివేటు బిల్లు ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంత్ రావు రాహుల్ గాంధీని కోరారు. అలాగే దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణంపై రాహుల్ గాంధీ తన అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం శిక్షణ శిబిరానికి చేరుకున్న రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అక్కడే ఉన్నారు. డీసీసీ అధ్యక్షులను ఉద్దేశించి రాహుల్ గాంధీ దాదాపు రెండు గంటల పాటు ప్రసంగించి, పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

రాజ్యసభ సభ్యుల ఎంపికపై కీలక చర్చ

వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతల మధ్య కీలక చర్చ జరిగింది. సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

మహిళా భద్రత, సాధికారతకు సమగ్ర కార్యాచరణ

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదర్భంగా మహిళలకు వరాలు
- మహిళా సాధికారతకు అవసరమైన పథకాలను రూపొందిస్తాం
- సీఎం ఆమోదంతో త్వరలో ప్రారంభిస్తాం
- కీలక శాఖల అధికారులతో మంత్రి సీతక్క విస్తృత సమీక్ష



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 2: మహిళా భద్రతను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా మౌలిక వసతులు, సాంకేతికత, అవగాహన, పర్యవేక్షణ, బాధ్యతాయుత పరిపాలనల సమన్వయంతో చూడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క అన్నారు. మహిళల రక్షణ కోసం విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థల్లో, కంపెనీల్లో ఐసీసీ కమిటీలకు తప్పనిసరి ఆడిట్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. రాత్రి 8 గంటల తర్వాత మహిళా ఉద్యోగులకు జీపీఎస్ అనుసంధానిత సురక్షిత రవాణా విధానం ఉండాలని మంత్రి సూచించారు.

రాష్ట్రసచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క పలు కీలక శాఖల ఉన్నతాధికారులతో సోమవారం విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉన్నతాధికారులు సంజయ్ కుమార్, శికా గోయల్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, ప్రియాంకా వర్గీస్, శృతి ఓజా, దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, సైబర్ క్రైమ్ నియంత్రణ చర్యలు సమర్థవంతంగా పనిచేస్తున్నప్పటికీ, విద్యాసంస్థలు, హాస్టళ్లు, కార్యాలయాలు, రాత్రి వేళల ప్రయాణాలు, డిజిటల్ వేదికలు, అసంఘటిత రంగం వంటి విభిన్న రంగాల్లో ఇంకా వ్యవస్థాపరమైన లోపాలు ఉన్నాయని సమావేశం అభిప్రాయపడింది. వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అసంఘటిత రంగ మహిళల కోసం ప్రత్యేక నమోదు, గుర్తింపు కార్డు, ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రజా రవాణాలో సీసీటీవీ పర్యవేక్షణను బలోపేతం చేయాలని నిర్ణయించారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగ మహిళల రక్షణకు ప్రత్యేక విధానాలు రూపొందించాలన్నారు. గృహ హింస కారణంగా ఒంటరిగా మిగిలిన మహిళలకు రుణాలు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళల భద్రతకు సంబంధించి హెం, మహిళా శిశు సంక్షేమ, విద్య, కార్మిక, రవాణా, మున్సిపల్ పరిపాలన, ఐటీ, ఆరోగ్య శాఖలు సమన్వయంతో రాష్ట్ర స్థాయి మహిళా భద్రత కన్వర్జెన్స్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులందరికీ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధం చేయాలని, ప్రయివేటు రంగంలో పనిచేస్తున్న మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్స్ అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లైంగిక వేధింపుల కేసుల పురోగతిపై ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల కోసం ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించాలని, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లలో చేరిక ప్రక్రియను ప్రభుత్వ యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మహిళా సాధికారతకు అవసరమైన పలు కీలక పథకాలను రూపొందించి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతో త్వరలో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ మహిళా శక్తి యూనిఫాం సారీల డిజైన్లను పరిశీలించిన మంత్రి సీతక్క కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా పంపిణీ చేస్తామని ప్రకటించారు.



సంప్రదాయ పద్ధతిలో హోలీ పండుగ జరుపుకోవాలి

- రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 2: రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ పండుగ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ మన సంస్కృతిలో స్నేహం, సౌహార్దం, ఆనందానికి ప్రతీక అని అన్నారు. రంగులలా మన జీవితాలు సంతోషాలతో నిండాలని, ప్రతి ఇంట్లో ఐక్యత, శాంతి, సుఖసమృద్ధులు నెలకొనాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ఈ సందర్భంలోఃఅందరం కలిసికట్టుగా సామరస్యంతో ముందుకు సాగుదామని, ద్వేషాలకు తావులేకుండా ప్రేమ, పరస్పర గౌరవంతో సమాజాన్ని మరింత బలపరచుదామని పిలునిచ్చారు. సహజసిద్ధమైన రంగులు , సంప్రదాయ పద్ధతిలో హోలీ పండుగ జరుపుకోవాలని సూచించారు. హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

సీఎం రేవంత్ హోలీ శుభాకాంక్షలు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 2 : తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోలీని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోలీ అని సీఎం గుర్తు చేశారు. సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోలీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు.



క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- అందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి అండగా ప్రభుత్వం
- యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- ఆర్థిక సాయం, ప్రోత్సాహకాలపై సమీక్ష
- బడ్జెట్లో కేటాయింపులు ఉండేలా ప్రతిపాదనలు
- అధికారులను ఆదేశించిన మంత్రి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 2: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 20262027 బడ్జెట్ లో క్రీడాకారులకు ఆర్థిక సహాయం, ఇతర వసతులపై డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ తీసుకు వచ్చి క్రీడలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ఆటల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. అందులో భాగంగా క్రీడా శాఖకు 20262026 బడ్జెట్ లో అధిక నిధుల కేటాయింపుతో పాటు, క్రీడాకారులకు ఆర్థిక సహాయంపై అధికారులతో చర్చించారు. ఒలంపిక్, పారా ఒలంపిక్, అంతర్జాతీయ, జాతీయ ఆటల పోటీల్లో పతకాలు సాధిందించిన వారికి ఆర్థిక సహాయం అందించేలా బడ్జెట్ లో కేటాయింపులు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సహంతోనే విద్యార్థి, యువకులు క్రీడల్లో రాణిస్తారని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. క్రీడాకారులకు ఇచ్చే పారితోషికాలపై విధివిధానాలు రూపొందించాలని, వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మహిళా పోరాట స్ఫూర్తిని చాటాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 2: అనాగరిక సమాజాన్ని నాగరిక పథంలో నడిపించడంలో మహిళల పాత్ర అనన్యసామాన్యమని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొనియాడారు. మహిళా పోరాట స్ఫూర్తిని చాటాలని ఈ సందర్భంగా కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా సభ్యులకు సోమవారం జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం అంటే కేవలం వేడుక కాదని, అది మహిళా పోరాట స్ఫూర్తికి, త్యాగాలకు నిదర్శనమని పేర్కొన్నారు. నేటి యువత మహిళా యోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సమాజాన్ని ముందుకు నడిపించాలనే ఉద్దేశంతోనే ఈ ఆత్మపరిశీలన వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళల్లో చైతన్యం నింపేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో సుమారు 63 మంది మెప్మా సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యాస రూపంలో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎం సంతోషి, పలువురు కౌన్సిలర్లు, ఆర్పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు, జేఏసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


దుబాయ్‌లో చిక్కుకుపోయిన మంత్రి తుమ్మల

- క్షేమంగానే ఉన్నానంటూ సందేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 2 : ఇరాన్ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్ లో చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు.

పాకిస్థాన్ సైనిక స్థావరాలపై ఆఫ్ఘన్ ఎయిర్‌ఫోర్స్ దాడి



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 2: పాకిస్థాన్ లోని కీలక సైనిక స్థావరాలపై తమ వైమానిక దళం దాడులు నిర్వహించిందని ఆఫ్ఘనిస్థాన్ రక్షణ శాఖ వెల్లడించింది. భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టినప్పుడు రావల్పిండి లోని నూర్ ఖాన్ వైమానిక స్థావరం ధ్వంసమైంది. ప్రస్తుతం పాకిస్థాన్ దాన్ని రిపేర్ చేసుకుంటోంది. ఇప్పుడు ఆఫ్ఘనిస్థాన్ కూడా ఆ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుంది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య గత కొన్ని రోజులుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో.. పాక్ కీలక సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఆఫ్ఘనిస్థాన్ వెల్లడించింది. నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తోపాటు క్వెట్టాలోని 12వ కార్ప్స్ ప్రధాన కార్యాలయం, ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పలు కీలకమైన పాక్ సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. తమ దేశంలోని వివిధ ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు నిర్వహించిందని ఆందోళన వ్యక్తంచేసింది. పాకిస్థాన్ సైనిక చొరబాట్లకు ప్రతీకారంగా ఈ దాడులు నిర్వహించినట్లు ఆఫ్ఘనిస్థాన్ రక్షణ శాఖ ప్రకటించింది. తాము చేసిన దాడిలో నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తో పాటు పలు సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని తెలిపింది. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌లోని జలాలాబాద్‌లో పాకిస్థాన్ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు తాలిబన్‌లు తెలిపారు.


శ్రీపాద రావు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- స్పీకర్ వ్యవస్థకే వన్నె తెచ్చిన విలువల శిఖరం
- పదవి అంటే బాధ్యత అని చాటి చెప్పిన దార్శనికుడు
- కర్ణాటక స్పీకర్ యూటీ ఖాదర్ ఫరీద్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 2 : స్పీకర్ వ్యవస్థకే వన్నె తెచ్చిన విలువల శిఖరం శ్రీపాదరావు అని కర్ణాటక స్పీకర్ యూటీ ఖాదర్ ఫరీద్ కొనియాడారు. రాజకీయాల్లో పదవి అనేది నెత్తిన పెట్టుకునే కిరీటం కాదు, అది బాధ్యత అని చాటిచెప్పిన దార్శనికుడన్నారు. సోమవారం హైటెక్ సిటీలోని శిల్పాకళా వేదికలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 89వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూటీ ఖాదర్ ఫరీద్ మాట్లాడుతూ సర్పంచ్ నుంచి స్పీకర్ వరకు ఎదిగిన శ్రీపాద రావు రాజకీయ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం లేకపోతే అది అధికారం అవుతుంది తప్ప సేవ కాదని బలంగా విశ్వసించారన్నారు. చివరి వరకూ ప్రజా సేవే శ్వాసగా విలువలతో కూడిన రాజకీయం చేశారన్నారు. ప్రజాప్రతినిధి సరిగ్గా పనిచేయకపోతే వెనక్కి పిలిచే "రీకాల్" విధానాన్ని మనస్ఫూర్తిగా సమర్థించిన గొప్ప ప్రజాస్వామ్యవాది శ్రీపాద రావు అని అన్నారు. స్పీకర్‌గా ఉన్నప్పుడు అధికార, ప్రతిపక్షాలకు సమాన అవకాశం కల్పించి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడారన్నారు. ఒక నాయకుడు ఎలా బతకాలో మాత్రమే కాదు, చనిపోయిన తర్వాత కూడా ప్రజల గుండెల్లో ఎలా బతికి ఉండాలో నిరూపించిన ధన్యజీవన్నారు. సభాపతి హోదాలో ఆయన నెలకొల్పిన ప్రమాణాలు నేటి తరుణంలో ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీపాదరావు కేవలం చట్టసభకే పరిమితం కాలేదని, సామాజిక ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కూడా అమాయకులను రక్షించేందుకు రాజ్యాంగ పరిధిలో ఉండి ధైర్యంగా పోరాడారని గుర్తు చేశారు. ఆయన చూపిన విలువల బాటలో పయనిస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా, నిబద్ధత గల నాయకుడిగా మంత్రి శ్రీధర్ బాబు ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తిని రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు. "ప్రజా క్షేత్రంలో సాటి మనిషి కోసం ఎలా నిలబడాలి, కష్టాల్లో ఉన్నవారికి ఎలా అండగా నిలవాలనే నైతిక విలువల్ని మా నాన్న మాకు వారసత్వంగా ఇచ్చారు. తనను నమ్ముకున్న ఒక సామాన్య కార్యకర్త ఇంటికి వెళ్తూ, ప్రజల మధ్యే ఆయన అమరుడయ్యారు. తన ఊపిరి ఆగిపోయే వరకు ప్రతి అడుగు ప్రజల కోసమే వేశారు" అని శ్రీపాద రావు తనయుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని, అదే నిబద్ధతతో ప్రజా సేవలో ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు విజయ రమణా రావు, రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, ఆది శ్రీనివాస్, ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, అరికెపూడి గాంధీ, మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





చంద్రగ్రహణం సందర్భంగా చిలుకూరు బాలాజీ ఆలయం మూసివేత

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 02 : చంద్రగ్రహణం సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయం తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మంగళవారం 3వ తేదీ ఉదయం 7:30 గంటలకు నిత్యసేవలు ముగిసిన అనంతరం దేవాలయ ద్వారాలు మూసివేయబడతాయి. గ్రహణ సమయమంతా ఆలయంలో ఎలాంటి దర్శనాలు నిర్వహించబడవు. సాయంత్రం 7 గంటలకు సంప్రదాయ పద్ధతిలో శుద్ధి కార్యక్రమాలు జరుగుతాయి. అయితే ఆ సమయంలో కూడా భక్తులకు దర్శనం అనుమతించబడదని స్పష్టం చేశారు. బుధవారం ఉదయం 6 గంటలకు సాధారణ దర్శనం పునఃప్రారంభమవుతుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ దర్శన కార్యక్రమాలను అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని ఆలయ నిర్వహణ విజ్ఞప్తి చేసింది.

అమ్మాపూర్ మైసమ్మ ఆలయం మూసివేత.

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 03 : చంద్రగ్రహణం సందర్భంగా మొయినాబాద్ మండలం అమ్మాపూర్ మైసమ్మ ఆలయం మూసివేయనున్నారు. మంగళవారం ఉదయం 7:30 గంటలకు సేవలు ముగించి గుడి మూసివేయబడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరిగి సాయంత్రం 7 గంటలకు శుద్ధి కార్యక్రమం జరుగుతుందని, కానీ భక్తులకు దర్శనాలు ఉండవన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు భక్తులకు దర్శనం ప్రారంభమవుతుంది. భక్తులు గమనించాలని కోరారు.



మా సైన్యం ఇరాన్ నుంచి చెత్తను తొలగిస్తోంది. మేమింకా భారీస్థాయిలో దాడి చేయలేదు. త్వరలో భీకర దాడి జరగబోతోంది. ప్రజలు ఇళ్లలోనే ఉండాలి. బయట సేఫ్ కాదు. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగడం నాకూ ఇష్టం లేదు. 4 వారాల్లో ముగుస్తుందని భావిస్తున్నా. ఇరాన్ ప్రజలు తమ దేశంపై నియంత్రణ సాధించాల్సిందే. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడి చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ఓపెన్ వాయిస్

ముగిసిన ఖమేనీ శకం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ధృవీకరించింది. టెహ్రాన్‌లోని ఆయన నివాసం లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, కీలకమైన సైనిక నాయకులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త ధృవీకరణ కావడంతో ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది. దశాబ్దాల కాలం పాటు ఇరాన్ రాజకీయ, సైనిక వ్యవస్థను శాసించిన ఒక శకం దీనితో ముగిసింది. ఖమేనీ మరణంతో అమెరికా, ఇజ్రాయెల్ పంతం నెగ్గినట్లయింది. అయితే యుద్ధం ముగిసిపోతుందా అంటే చెప్పడం కష్టం. ఖమేనీ చనిపోయినా ఇరాన్ లొంగిపోయే అవకాశాలు కనిపించడం లేదు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, నాయకత్వ బాధ్యతలను తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల కౌన్సిల్ స్వీకరించింది. కానీ క్షేత్రస్థాయిలో పట్టున్న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతీకారేచ్ఛతో ఉంది. ఇప్పటికే అమెరికా స్థావరాలపై , ప్రాంతీయ మిత్రదేశాల లక్ష్యాలపై ఇరాన్ క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. నాయకత్వ శూన్యతను పూడ్చుకునే క్రమంలో ఇరాన్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌ను ధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు లభించిన గొప్ప అవకాశంగా అభివర్ణించారు. ప్రస్తుతం ఇరాన్ తన తదుపరి వారసుడిని ఎన్నుకునే ప్రక్రియలో ఉంది. ఖమేనీ కుమారుడు వారసుడు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే అమెరికా ప్రోద్భలంతో అధికార మార్పిడి సజావుగా సాగదని.. అంతర్గత తిరుగుబాట్లకు దారితీసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇరాన్ లోపల అంతర్యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, అది ప్రపంచ చమురు సరఫరాను , ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. యుద్ధం ఆగిపోవడానికి బదులు, ఇది ఒక సుదీర్ఘమైన ప్రాంతీయ సంఘర్షణకు ఆరంభంగా మారుతుందేమోనన్న భయం గల్ఫ్ దేశాల్లో నెలకొంది. అందుకే ఖమేనీ అంతంతో అన్నీ అయిపోలేదు.. అసలు సమస్యలు ముందున్నాయని ప్రపంచదేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై క్షిపణులతో విజృంభించాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమర్చాయి. ఖమేనీ కూతురు, అల్లుడి కూడా ఈ దాడుల్లో మరణించినట్లు ఇరానీ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఖమేనీ మరణంతో పాటు 40 రోజుల పాటు సంతాప దినాలు ప్రకటిస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం నుంచి మొదలైన యుద్ధం నిర్విరామంగా కొనసాగుతోంది. ఖమేనీని హతమార్చుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత కొంతకాలంగా ప్రకటిస్తూ వస్తోన్నారు. చివరికి ఇజ్రాయెల్‌తో కలిసి తన శపథాన్ని ట్రంప్ నెరవేర్చుకున్నారు. అయితే ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయి. బంగారం, వెండి ధరలు మండిపోతున్నాయి.ఖమేనీ మరణంతో యద్ధం మరింత ముదిరే అవకాశముంది. గల్ఫ్ దేశాలైన దుబాయ్, ఖాతార్, అబుదాబిపై ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. గల్ఫ్ దేశాల పై కూడా యుద్ధ ప్రభావం పడటంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముడి చమురు ధరలు పెరిగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో దేశవ్యాప్తంగా సరకు రవాణా ఖర్చులు పెరిగేందుకు అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో భద్రత లేకపోతే నౌకలు ఆఫ్రిగా మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో సరకు రవాణా సమయం 1520 రోజులు అవుతుంది. దీంతో ఖర్చు 50 శాతం వరకు పెరుగుతంది. ఇవన్నీ అంతిమంగా వినియోగదారుడిపైనే పడతాయి. ఇదే కాకుండా ఇరాన్, ఇజ్రాయెల్, కువైట్ తదితర దేశాల గగనతలాలు పాక్షికంగా మూసివేశారు. దీంతో ఎయిర్ ఇండియా, ఇండిగో విమాన కంపెనీలు అమెరికా, ఐరోపా రూట్లను మళ్లించాయి. దీంతో ఇంధ ఖర్చుల ప్రభావం కనిపిస్తుంది. దీంతో విమాన టికెట్ల ధరలు భారీగా పెరగవచ్చు. ప్రస్తుతం బ్యారెల్‌కు బ్రెంట్ క్రూడ్ 70 డాలర్ల కంటే ఎక్కువగా ఉంది. ఈ వారంలో ధరలు మరింత పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశం ముడి చమురును 80 శాతం వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది.


ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
03.03.2026

సార్వభౌమత్వంపై దాడి, ప్రపంచ న్యాయ వ్యవస్థకు సవాలు



యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

ప్రపంచ చరిత్రలో కొన్ని సంఘటనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అవి కేవలం వార్తలు విశేషాలు కావు, సమాధానం లేని ప్రశ్నలు. ప్రపంచానికి సవాలుగా నిలిచే ఘట్టాలు. ఈరాన్ పై అమెరికా ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖామెనాయీ పొందిన వీర మరణం ప్రపంచ చరిత్రలో ఓ ప్రత్యేక ప్రాముఖ్యతను పొందింది. ఇది కేవలం ఒక వ్యక్తి మరణ వార్త మాత్రమే కాదు; ఇది సామ్రాజ్యవాద శక్తి రాజకీయాల నిర్మమ స్వరూపాన్ని ప్రపంచం ముందుచిన దుర్ఘటన. ఒక సార్వభౌమ దేశపు అత్యున్నత మతాధికార రాజకీయ నాయకుడు విదేశీ దాడిలో ప్రాణాలు కోల్పోవడాన్ని, అంతర్జాతీయ వ్యవస్థ ఏదృష్టితో చూస్తోంది? సామ్రాజ్యవాద దేశాలు తీసుకునే నిర్ణయాలు అంతర్జాతీయ న్యాయ చట్టాలకంటే ఉన్నతమైనవా? అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాలు తమ భద్రతా అవసరాలు, అస్తిత్వ భయాల సాకుతో ఎలాంటి దుర్మార్గాలకైనా పాల్పడవచ్చా? ఇది ఈరాన్ సార్వభౌమత్వంపై దాడి కాదా? అంతర్జాతీయ చట్టాలు అందరికీ సమానంగా వర్తించవా? ఆ చట్టాలేమైనా శక్తివంతుల చుట్టాలా? ఇదీ ఇప్పుడు ప్రపంచం ముందున్న అసలు ప్రశ్న. యునైటెడ్ నేషన్స్ వంటి సంస్థలు అత్యవసర సమావేశాలు నిర్వహించినా, తీర్మానాలు ఆమోదించినా, ఆందోళన వ్యక్తం చేసినా అమలు చేసే శక్తి లేకపోతే, ఆ ప్రకటనలు కేవలం గాలి మాటలు తప్ప మరేమీకాదు. వీటో రాజకీయాలు బలవంతులకు రక్షణ కవచంగా మారితే, బలహీన దేశాలకు న్యాయ రక్షణ ఎవరు కల్పించాలి? నిజానికి ఖామెనాయీ మరణాన్ని కొందరు ఓటమిగా చూడటం లేదు. దాన్ని వారు వీరమరణంగా భావిస్తున్నారు. 'హుసైన్ మరణం యజీద్ అంతానికే.. ప్రతి కర్బలా తరువాత ధర్మం సజీవమౌతుంది.' అనే ప్రసిద్ధ ఉర్దూ కవితా పాదం ఇప్పుడు ఈరాన్ లో ప్రతిచోటా వినిపిస్తోంది. ఒక నాయకుడి రక్తం జాతికి కొత్త జీవం పోస్తుందని, షహాదత్ జాతీయ ఐక్యతకు మూలమని విశ్వసించేవారూ ఉన్నారు. బయటి దాడి ఎదురైనప్పుడు దేశీయ విభేదాలు తాత్కాలికంగా పక్కన పెట్టి అందరూ ఏకమవ్వడం అనేది సాధారణం. ఇరాన్ సైనిక వ్యవస్థలో ప్రభావవంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇప్పటికే కఠినమైన హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పుడు ఈరానీయుల్లో ప్రతీకార జ్వాల రగులుతోంది. అందరూ భావోద్వేగాలకు లోనై ఉన్నారు. ఒక దాడి మరో దాడికి దారి తీస్తుంది. ఆ తరువాత మూడోది. పరిమిత చర్యలుగా ప్రారంభమైన ఘర్షణలు ప్రాంతీయ అగ్నిపర్వాలుగా మారిన ఉదాహరణలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఇరాక్, సిరియా, లెబనాన్, యెమెన్ వంటి ప్రాంతాలు ఇప్పటికే సంక్లిష్ట సమీకరణాల్లో చిక్కుకున్నాయి. ఈ ఘటన తర్వాత ఆ సమీకరణాలు మరింత అస్థిరమవుతాయా అన్నది ప్రపంచం గమనిస్తోంది. సామ్రాజ్యవాద రాజకీయాల స్వభావం ఎప్పుడూ నైతికతతో సరిపోలదు. ఒక నాయకుడి నిర్మూలనతో సమస్యలు ముగుస్తాయనే నమ్మకం తరచుగా భ్రమగానే మిగిలింది. రాజకీయంగా ఒక శూన్యత ఏర్పడినప్పుడు ఆ శూన్యతను ఎవరు పూడుస్తారన్నది ప్రశ్నగా మిగులుతుంది. బయటి దాడి ఎదురైనప్పుడు జాతీయతా భావం బలపడుతుంది. ఇంత జరుగుతున్నా అరబ్



ప్రపంచం, దక్షిణాసియా దేశాలు చోద్యం చూస్తూ మౌనం వహిస్తున్నాయి. కనీస నైతిక బాధ్యత కూడా నిర్వర్తించకుండా సామ్రాజ్యవాదానికి దాసోహమంటున్నాయి. అంతర్జాతీయ రాజకీయాల్లో ఆయా దేశాలు తమ ప్రయోజనాలకు భంగం కలగకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఆర్థికపరమైన, భద్రతా ఒప్పందాలు, అంతర్గత అస్థిరత, ప్రపంచ శక్తులతో ఉన్న సంబంధాలు ఇవన్నీ వారి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. బయటి వారికి అది ఎలాగైనా కనిపించవచ్చు. కానీ వాస్తవంలో అది స్వార్థపూరితమైన లెక్కల రాజకీయమే. అయితే ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే, ఒక సార్వభౌమ దేశపు నాయకుడు విదేశీ దాడిలో మరణిస్తే, అది ప్రపంచానికి ఎలాంటి సంకేతం ఇస్తుంది? సామ్రాజ్యవాది, శక్తివంతుడు తనకు ప్రమాదమని భావించిన వ్యక్తిని లక్ష్యంగా చేసుకోవచ్చా? అలా అయితే రేపు అదే ప్రమాణం మరొకరికి కూడా వర్తిస్తుంది కదా? ఇప్పటికే ఇలాంటి ఉదాహరణలు మన ముందున్నాయి. అంతర్జాతీయంగా వ్యవస్థలు పరస్పర గౌరవంపై నిలబడాలి. నమ్మకం కూలిపోతే అనిశ్చితి మాత్రమే మిగులుతుంది. కర్బలా అనేది కేవలం చారిత్రక సంఘటన కాదు; అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడిన సంకేతం. కానీ ఆధునిక రాజకీయాల్లో ఆ ప్రతీకను ఎలా ఉపయోగిస్తాం అన్నది కూడా ముఖ్యం. అమెరికా ఈ చర్యను తన భద్రతా వ్యూహంలో భాగంగా చూపిస్తోంది. ఇజ్రాయెల్ దీనిని తన అస్తిత్వ రక్షణగా చెబుతోంది. నిజానికి ఇది ఈరాన్ సార్వభౌమత్వంపై దాడి. అమెరికా తన ప్రయోజనాలు నెరవేర్చుకోవడంకోసం, తనకు ఎదురు మాట్లాడే దేశాలపై దాడులు చేయడం, అక్కడి పాలకుల్ని నయానా భయానా లొంగదీసుకోవడం, మాట వినని వారిని చంపేయడం, తన కీలుబొమ్మల్ని ప్రతిష్ఠించుకోవడం అమెరికా నియంతృత్వానికి ప్రబల నిదర్శనం. తన స్వీయ ప్రయోజనాలకోసం అమెరికా పాల్పడుతున్న ఈ దుర్మార్గాలకు ప్రపంచం మూల్యం చెల్లించుకోవలసి వస్తోంది. చమురు మార్కెట్లు, సముద్ర మార్గాలు, ఆర్థిక వ్యవస్థలు, రాజకీయ కూటములు ఇవన్నీ ఈ ఘర్షణ ప్రభావాన్ని అనుభవిస్తున్నాయి. ఒక ప్రాంతంలో చెలరేగిన అగ్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపివేయగలదు. అంతర్జాతీయ అనిశ్చితి పెట్టుబడులను తగ్గించగలదు. భయాలు రాజకీయాలను ప్రభావితం చేయగలవు. ఇక్కడ గంభీరమైన నైతిక ప్రశ్న కూడా ఒకటుంది. మానవ హక్కులు, సార్వభౌమత్వం, అంతర్జాతీయ న్యాయం గురించి ప్రపంచం తరచూ మాట్లాడుతుంది. కానీ ఆ ప్రమాణాలు అందరికీ సమానంగా వర్తిస్తున్నాయా? శక్తివంతమైన దేశాల చర్యలను ప్రశ్నించే ధైర్యం అంతర్జాతీయ వ్యవస్థకు ఉందా? లేక అది రాజకీయ సమీకరణాల బందీగా మారిందా? ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు లేవు. నిగ్గదీసి ప్రశ్నించే నాథుడూ లేడు. ప్రపంచం ఇప్పుడు ఒక సున్నితమైన అంచుల కత్తిపై నిలబడింది. ఒక తప్పుడు సమీకరణ ప్రాంతీయ యుద్ధాన్ని విస్తరించగలదు. ఒక అబద్ధపు ప్రకటన మార్కెట్ వ్యవస్థను కుదిపేయగలదు. ఒక ప్రతీకార దాడి మరో అగ్నిపర్వానికి నాంది పలుకగలదు. అదే సమయంలో ఒక మంచి మాట, ఒక మధ్యవర్తిత్వ ప్రయత్నం, ఒక రాజనీతిజ్ఞ చర్య యుద్ధోన్మాదాన్ని నియంత్రించనూ గలదు. సామ్రాజ్యవాద రాజకీయాలు ఎంత దుర్మార్గంగా ఉన్నా, ప్రజాస్వామ్య, నైతిక, మానవీయ శక్తులు తమ ప్రయత్నాలను మానుకోకూడదు. కళ్ళ ముందు అరాచకం, అనాగరికం, ఆటవికత విజృంభిస్తుంటే, కళ్ళుమూసుకోవడం, పిరికితనం మాత్రమే కాదు, దౌర్జన్యానికి మద్దతు పలకడంతో సమానం. న్యాయం, అన్యాయం మధ్య సమతుల్యత కోల్పోతే, అనిశ్చితి మాత్రమే మిగులుతుంది. ఖమేనాయీ మరణం ఒక వ్యక్తి అంతం కావచ్చు. కానీ అది అంతర్జాతీయ ప్రపంచానికి సవాలు విసిరింది. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ, చట్టాలూ అగ్రరాజ్య పరిమితులకు లోబడడం అత్యంత శోచనీయం. ప్రపంచం మౌన వీక్షకుడిగా ప్రేక్షక పాత్రకు పరిమితమైపోయింది. పశ్చిమాసియా అగ్నిని ఆర్పేందుకు ముందుకు రాగల సాహసి ఎవరూ కనిపించడంలేదు. చివరికి ఇది ఎటువంటి ముగింపుకు దారి తీస్తుందో కాలమే తీర్పు చెప్పాలి.

'కుమ్మెర' లేవనెత్తిన ప్రశ్న.. హిందువులంతా బంధువులేనా?



సంపతి రమేష్
7989579428

భారత రాజ్యాంగం "సమానత్వం" అనే మహోన్నత విలువలపై నిర్మించబడింది. ఆ పునాదులకు రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. కానీ ఇప్పటికీ రాజ్యాంగం ఆశించిన సమానత్వం ఆమడ దూరంలోనే ఉన్నది. అయితే, హిందువులంతా బంధువులమనే భారతీయ సమాజంలో దేవాలయం దగ్గర కులం పేరుతో జరిగిన దాడి మరోమారు హిందుధర్మంలో అసమానతలను నొక్కి చెబుతుంది. ఇదీ హిందుత్వానికి మాయని మచ్చ. ఇటీవల నాగర్ కర్నూలు జిల్లా, కుమ్మెర గ్రామంలో మల్లన్న స్వామి జాతరలో బీసీ చాకలి కుటుంబంపై జరిగిన దాడి దేశాన్ని కుదిపేస్తుంది. రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారుల ఆధిపత్యం మానవత్వానికి మచ్చగా మిగిలింది. ఒక శిశువు ప్రాణం కుల అహంకారానికి బలి కావడం కేవలం నేరమే కాదు, అది మానవత్వంపై జరిగిన దాడి. ఈ అన్యాయంపై మొట్టమొదట గళమెత్తిన నాయకుడు బీసీ, ఎస్సీ ,ఎస్టీల విముక్తి ఉద్యమ రథసారధి డాక్టర్ విశారదన్ మహరాజ్. ఆయన హిందూ ధర్మంలో బీసీ ఎస్సీ ఎస్టీల వాటా ఎంత? అని వేసిన ప్రశ్న పలువురుని ఆలోచింపచేస్తుంది. దళిత, బహుజన వర్గాల రక్త మాంసాలతో ఈ దేశంలోని గుళ్ళు, గోపురాలను నిర్మించారు. వేల ఏళ్లుగా హిందు ధర్మాన్నీ కాపాడుతున్నారు. అయినా వారిని దేవుని గర్భగుడిలోకి అనుమతించకపోవడం, ఆంక్షలు విధించడంపై ప్రశ్నించాడు. అనాడు అంబేద్కర్ కాలారామ్ దేవాలయం ముందు నిలబడి ప్రశ్నించినది ఇదే. పెరియార్ వైకోం సత్యగ్రహంలో గళమెత్తినది కూడా ఇదే. నేడు కుమ్మెర గ్రామంలో డాక్టర్ విశారదన్ ప్రశ్న కూడా అదే.

హిందుత్వంలో అణగారిన వర్గాల వాటా ఎంత?

ప్రపంచానికే విద్య ,విజ్ఞానం, సంస్కృతి పంచిన గొప్ప దేశం మనది. "హిందువులంతా బంధువులు" అనే నినాదం మహోన్నతమైనది. కానీ ఆ నినాదం వాస్తవ జీవితంలో ప్రతిబింబిస్తుందా? అనేది ప్రశ్నార్థకమే! కుమ్మెర గ్రామ ఘటన దీనికి సజీవ సాక్ష్యం. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వర్ణ-కుల వ్యవస్థ ఈ దుర్ఘటనకు మూలకారణం. ఆధ్యాత్మిక ప్రదేశాలలో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడమే ఈ ఆధిపత్యానికి నిదర్శనం. ఏ దేవుడైన సమానత్వం బోధిస్తాడు. కానీ అగ్రకులాలు



ఆదిపత్యం ఒక వ్యవస్థను నిర్మించుకొని బీసీ ఎస్సీ ఎస్టీలను శూద్రులుగా, బానిసలుగా చూస్తున్నారు. అయినా దళిత, బహుజనులు హిందువులంతా బంధువులుగానే భావించుకుంటూ వేల సంవత్సరాలుగా హిందూ మతాన్ని కాపాడుతున్నారు. చారిత్రకంగా వారికి ఆయుధం, భూమి, సంపద, విద్య వంటి ప్రధాన వనరులపై సమాన హక్కులు లభించలేదు. ఈ సామాజిక కట్టుబాట్లు, అసమానతల వల్ల దేశ రక్షణ, ఆర్థిక స్థితి, సామాజిక ఐక్యత దెబ్బతిన్నది. ఉదాహరణకు భారతీయ హిందురాజు పృధ్వీరాజ్ చౌహాన్ కాలంలో జరిగిన తరైన యుద్ధాలలో మహమ్మద్ గోరి భారతదేశాన్నీ ఆక్రమించాడు. ఈ యుద్ధంలో బహుజనుల భాగస్వామ్యం లేకపోవడం వలన దేశం ఆక్రమణకు గురైంది. వారి చేతిలో అధికారం ఉండి ఉంటే ఎవరు కూడా కన్నెత్తి చూసే సాహసం చూపేవారు కాదు. ఇప్పటికీ కూడా భారతదేశంలో కొన్ని కులాల చేతిలో అధికారం కేంద్రీకృతం కావడం వల్లనే అభివృద్ధి సాధించలేకపోతుంది. దీనికి ప్రధానకారణం హిందూమతంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధికారం ఇవ్వకపోవడమే.

శివుని సమానత్వంతో పోరాడినప్పడే...

నేటికీ గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు హిందు ధార్మిక కార్యక్రమాలలో అగ్రకులాధిపత్యం రాజ్యమేలుతుందనడానికి కుమ్మెర ఘటన మనకు ఒక గట్టి హెచ్చరిక. ఇది ఆధునిక భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘన. దేవాలయం ఒక వర్గం సొత్తు కాదు, వెనుకబడిన కులాలను తమ ఆధీనంలో ఉంచుకోవాలనే ఆధిపత్య పోకడలు కొనసాగున్నాయి. ఇప్పటికీ అక్కడక్కడ గ్రామాల్లో అట్టడుగు కులాల ఆలయ ప్రవేశాన్నీ అడ్డుకోవడం, సామాజికంగా బహిష్కరించడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తుండడం ఇందుకు ఉదాహరణ. అదేవిధంగా ఆ వర్గాలు రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని కూడా చెలాయించడాన్ని ఓర్చుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో కుమ్మెర ఘటనలో డాక్టర్ విశారదన్ పోరాటం హిందు స్వాభిమానానికి, మానవ గౌరవానికి, రాజ్యాంగ ఆత్మకు సంబంధించిన పోరాటంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన నికార్సైన పోరాటానికి పలువురు సామాజిక ఉద్యమకారులు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నాయి. సమాజం ముందుకు వెళ్లాలంటే అగ్రకులాలు ఆధిపత్య భావాలను విడిచిపెట్టి ప్రజాస్వామ్య గణతంత్ర విలువలను గౌరవించాలి. రాజ్యాంగ సమానత్వం పేజీల్లో మాత్రమే కాకుండా ఆలయ గర్భగుడిలోనూ, మన హృదయాల్లోనూ ప్రతిఫలించాలి. ఇందుకై సంస్థాగత మార్పులు అవసరం. కుమ్మెర గ్రామ ఘటనలో చాకలి కుటుంబంపై దాడి చేసిన నిందితుల్ని వెంటనే శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి. ఆధ్యాత్మిక ప్రపంచంలో అణగారిన వర్గాలను భక్తులుగా మాత్రమే చూడడం సరికాదు. వారికి నాయకత్వం, నిర్ణయాధికారం, గౌరవప్రదమైన ప్రాతినిధ్యం లభించినప్పుడే హిందువులంతా బంధువులు అవుతారు. అదే విధంగా అట్టడుగు వర్గాలు కేవలం భక్తులుగా మిగిలిపోతే సరిపోదు. శివుని సామాజిక సమానత్వం, సమ్మక్క సారలమ్మల, చాకలి ఐలమ్మల పోరాటం బాటలో నడిచినప్పుడే ఆధిపత్యం అంతమవుతుంది. అప్పుడే రాజ్యాంగం కోరుకున్న సమానత్వం అమలవుతుంది. లేదంటే బీసీ ఎస్సీ ఎస్టీలు అంధభక్తులుగా మిగిలి ఆధిపత్య వర్గాల చేతుల్లో బలవడమే అవుతుంది. ఇప్పటికైనా అట్టడుగు వర్గాలంతా మేల్కొని కుమ్మెర ఘటనలో న్యాయం కోసం ఉద్యమించాలి. లేదంటే చరిత్రలో తప్పు చేసిన వాళ్ళుగా మిగిలిపోతారు.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

ముస్లిం ప్రపంచంలో

సౌదీ విధానాలపై చర్చ!



ఫిరోజ్ ఖాన్
9640466464

పశ్చిమాసియా రాజకీయ వేదికపై "ముస్లిం ఉమ్మా ఐక్యత" అనే నినాదం తరచుగా వినిపిస్తుంది. అయితే ఆచరణలో ప్రాంతీయ దేశాలు అనుసరిస్తున్న విదేశాంగ వ్యూహాలు భిన్నంగా ఉండటం గమనించదగిన విషయం. ముఖ్యంగా సౌదీ అరేబియా ఇటీవలి కాలంలో అనుసరిస్తున్న దౌత్యపరమైన చర్యలు అంతర్జాతీయ వేదికలపై విశ్లేషణకు గురవుతున్నాయి. ఒకవైపు పరస్పర గౌరవం, శాంతి, సహకారం గురించి అధికారిక ప్రకటనలు వెలువడుతుండగా, మరోవైపు ప్రాంతీయ భద్రతా ఆందోళనల కారణంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలుతో వ్యూహాత్మక సంప్రదింపులు కొనసాగుతున్నాయి. కొంతమంది అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ ద్వంద్వ సమీకరణం ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడే ప్రయత్నంగా కూడా చూడవచ్చు.

చరిత్రలోని విదేశీ జోక్యాల పాఠాలు

1953లో ఇరాన్ దేశంలో జరిగిన రాజకీయ పరిణామాలు, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకత్వ మార్పులు, తదనంతర పరిణామాలు అంతర్జాతీయ రాజకీయ చరిత్రలో ముఖ్యమైన మలుపుగా భావించబడుతున్నాయి. 1979 ఇస్లామిక్ విప్లవం తరువాత ఇరాన్ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అవలంబించింది. 2015లో కుదిరిన అణు ఒప్పందం, 2018లో ఆ ఒప్పందం నుండి అమెరికా సంయుక్త రాష్ట్రాలు వైదొలగిన పరిణామం. ఇవన్నీ పశ్చిమాసియా రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపాయి.

చమురు రాజకీయాలు.. వ్యూహాత్మక భాగస్వామ్యం

1938లో సౌదీ అరేబియా దేశంలో చమురు నిల్వలు కనుగొనబడిన తరువాత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఆ దేశానికి ప్రత్యేక స్థానం ఏర్పడింది. చమురు సరఫరా, జలసంధుల భద్రత, సముద్ర మార్గాల రక్షణ వంటి అంశాలు ప్రాంతీయ వ్యూహాల్లో ప్రధాన ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హోర్ముజ్ జలసంధి భద్రతపై ఉన్న ఆందోళనలు, చమురు ఎగుమతులపై విధించబడిన ఆంక్షలు, ఆర్థిక ఒత్తిడులు, ఇవన్నీ ప్రాంతీయ సమీకరణాలను ప్రభావితం చేస్తున్న అంశాలుగా పరిగణించబడుతున్నాయి.

యమన్ విలయం వెనుక ప్రాంతీయ ఆధిపత్య పోరు

2015లో ప్రారంభమైన యమన్ అంతర్గత గృహ యుద్ధం ప్రపంచంలోనే తీవ్రమైన మానవతా సంక్షోభాల్లో ఒకటిగా నిలిచింది. హూతీ ఉద్యమానికి ఇరాన్ దేశం మద్దతు ఉందనే ఆరోపణల నేపథ్యంలో, సౌదీ నేతృత్వంలోని



కూటమి సైనిక చర్యలు చేపట్టింది. సంయుక్త రాజ్య సమితి నివేదికల ప్రకారం, యుద్ధం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం శాంతి చర్చలు, కాల్పుల విరమణ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రాంతీయ శక్తుల మధ్య రాజీ, పరస్పర విశ్వాసం పెరిగినప్పుడే దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమని విశ్లేషకులు సూచిస్తున్నారు.

పరస్పర గౌరవమే ఏకైక మార్గం

పశ్చిమాసియా రాజకీయాలను ఒకే కోణంలో అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. భద్రతా ఆందోళనలు, ఆర్థిక ప్రయోజనాలు, చారిత్రక విభేదాలు, మతపరమైన భావోద్వేగాలు ఇవన్నీ కలసి సంక్లిష్ట రాజకీయ సమీకరణాలను నిర్మిస్తున్నాయి. సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య ఇటీవల పునరుద్ధరించబడిన దౌత్య సంబంధాలు ప్రాంతీయ శాంతికి ఒక అవకాశంగా పరిగణించవచ్చు. సైనిక పోటీకి బదులుగా దౌత్య సంభాషణ, ఆర్థిక సహకారం, పరస్పర గౌరవం ఆధారిత విధానాలే దీర్ఘకాలిక స్థిరత్వానికి దారి తీస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

(వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

దుబ్బాకను ఆదర్శ పట్టణంగా తీర్చి దిద్దాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 02 : నూతన మున్సిపల్ పాలక వర్గంతోపాటు అధికారులు సమన్వయంతో పనిచేసి దుబ్బాక ను ఆదర్శ పట్టణంగా తీర్చి దిద్దాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాక పట్టణ కేంద్రం లోని మున్సిపల్ కార్యాలయంలో నూతన పాలకవర్గం తొలి సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి దుబ్బాక ఎమ్మెల్యే, ఎక్స్ అఫిషియో సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టణ సమస్యలపై సమావేశంలో విస్తృత చర్చ, మున్సిపల్ పరిధిలోని పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు.ముఖ్యంగా పట్టణం లోని డబుల్ బెడ్ రూమ్ గృహాల ప్రాంతాల్లో డ్రైనేజ్ సమస్యలు, మురికి కాలువల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ వెంటనే శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.పట్టణంలోని దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలని, ముఖ్యంగా ఐటీఐ కాలేజీకి వెళ్లేరహదారిని అత్యవసరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు పెరుగుతోందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, కౌన్సిలర్లు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వీధి కుక్కల పెరుగుదలపై ప్రత్యేక చర్యలు తీసుకుని, కుటుంబ నియంత్రణ (స్టెరిలైజేషన్) కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పా రిశుద్ధ సిబ్బంది పనితీరుపై కఠినంగా పర్యవేక్షణ ఉండాలని, సిబ్బంది విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిబంధనల ప్రకారమే నియామకాలు ఉండాలని స్పష్టం చేశారు.పట్టణంలో తాగునీరు వృథా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ టెండర్ల విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని, పక్కా నిబంధనల ప్రకారమే టెండర్లు వేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఎఫ్ ఎస్ టి పి నిర్వహణలో నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నిస్తూ, తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేసి దుబ్బాకను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశం లో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్,మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరాం సంగీత రవీందర్, వైస్ చైర్మన్ ఆ స సులోచన స్వామి, పాలకవర్గం సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా ప్రజలకు హోలీ పండశుభాకాంక్షలు
- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు



ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 02: హోలీ పండగను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిమానాలు, రోడ్డు ప్రమాదాలు,జైలు శిక్షలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పండగ పేరుతో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించవద్దని, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో మద్యం మత్తులో చెరువులు, కుంటాల వద్ద స్నానాలకు వెళ్లి ప్రమాదాలకు గురైన ఘటనలను గుర్తుచేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చిన్న పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే స్నానాలకు వెళ్లాలని, పిల్లల కదలికలపై తల్లిదండ్రులు పర్యవేక్షణ వహించాలని పేర్కొన్నారు. క్షణిక ఆనందం కోసం చేసే తప్పులు కుటుంబాలకు చేదు జ్ఞాపకాలు మిగల్చవచ్చని హెచ్చరించారు.ఈ హోలీ ప్రతి ఒక్కరి జీవితాన్ని రంగులమయం చేయాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు ఎస్పీ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.



మండుటెండల్లో కాళేశ్వరం జలాలు

- రంగనాయక సాగర్ కుడి కాలువ ద్వారా యాసంగి పంటలకు నీరు విడుదల
- కేసీఆర్, హరీష్ చిత్ర పటాలకు పాలాభిషేకం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02 : మండుటెండల్లో కాళేశ్వరం జలాలు రైతన్నల పొలాలకు చేరడంతో నంగునూర్ మండలంలో ఆనందం వెల్లివిరిసింది. కేసీఆర్, హరీష్ రావుల కృషితో కాళేశ్వరం జలాలు అందడంతో రైతుల కన్నీళ్లు తుడిచాయని స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేశారు.ఇటీవల ఇరిగేషన్ మంత్రికి లేఖ రాసిన హరీష్‌రావు సూచనల మేరకు యాసంగి పంటకు అధికారులు నీటిని విడుదల చేశారు. రంగనాయక సాగర్ కుడి కాలువ ద్వారా నీరు విడుదల కావడంతో నంగునూర్ మండలంలోని ముగ్ధంపూర్ కాలువ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు చిత్రపటాలకు నంగునూర్ మండలం విద్యార్థి విభాగం నాయకులు చింటు గౌడ్, ఇమ్రాన్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు.కాళేశ్వరం జలాలు పొలాలకు చేరడంతో యాసంగి పంటలకు జీవం లభించిందని రైతులు తెలిపారు. మండుటెండల్లో నీరు అందడంతో పంటలపై నమ్మకం పెరిగిందని వారు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి నాయకులు వంశీ, చరణ్, చింటు గౌడ్, చిన్న, సోహెల్, అరవింద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యా కమిషన్ సిఫారసులను

ఉపసంహరించుకోవాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.తిరుపతిరెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02 : ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి సారధ్యంలో ప్రభుత్వానికి నివేదించిన నివేదిక అశాస్త్రీయంగా, అనాలోచితంగా ఉందని ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపరిచి ,ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చే విధంగా ఉందనీ టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి పేర్కొన్నారు.కావున ఈ సిఫారసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కమీషన్ నీవేదికలో పూర్వ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ,కార్మికుల వేతనాలు పెంచాలని, తరగతి ఒక ఉపాధ్యాయుడు ,తరగతి ఒక గది నిర్మించాలని ప్రతిపాదన చేయడం ఆహ్వానించ దగ్గదే,కానీ ఉపాధ్యాయుల జీతభత్యాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి ఉపాధ్యాయ వర్గంపై తమ అక్కసును వెళ్లగక్కడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్లో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ధరలను దృష్టిలో పెట్టుకొని పిఆర్సి కమిటీలను ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తాయన్నారు.కానీ తమకు సంబంధం లేని వేతనాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు.ఇప్పటికే ఐదు డిఏలు పెండింగ్లో ఉండగా, 2023 జూలై నుండి రావాల్సిన పి ఆర్ సి ని ఎత్తివేసే కోణంలో ప్రభుత్వం ఆలోచించే విధంగా ఇతను సిఫారసులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.ప్రభుత్వ విధానాలకు వత్తాసు పలికే విధంగా, ఉపాధ్యాయ వర్గానికి తీవ్రంగా నష్టపరిచే విధంగా ఇతని సిఫారసులు ఉన్నాయన్నారు .కొన్ని కోర్సులు ఉండకూడదని ప్రవేశ పరీక్షలకు ఇంటర్మీడియట్ను దృష్టిలో ఉంచుకొని సిఫార చేయడం బాధాకరం అన్నారు. విద్యా ,మానసిక, వైజ్ఞానికవేత్తలు ఇచ్చిన సిఫారసులను గమనంలోకి తీసుకోకుండా ప్రైమరీ పాఠశాలల బోధనకు పీజీ డిగ్రీలు ఉండాలని సూచించడం శోచనీయంమని, ప్రైమరీ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులకు నాణ్యమైన బోధనా విధానాలు నేర్పడానికి, భాష పై పట్టు సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తే బాగుండేది అన్నారు.కానీ ఉన్నత అర్హతల వల్ల అభ్యర్థులకు వయసు భారం పెరగడం తప్ప ఇందులో ఎలాంటి లాభం లేదు. ఈ సిఫారసులు విద్యావ్యవస్థలో వివక్షను పెంపొందించే విధంగా ఉన్నవి, మండలానికొక పబ్లిక్ స్కూల్లో పెట్టాలని ఆలోచన ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల వ్యవస్థకు భిన్నంగా ఏమీ లేదనీ,ఒకే దగ్గర 1500 మంది విద్యార్థులు ఉండాలని ప్రతిపాదన ఏరకంగా సరైంది కాదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలనే బదులు మొత్తం విద్యా వ్యవస్థను తీసేసి ఇంటర్ మార్కులకు ప్రాధాన్యత ఇవ్వలనడం కార్పొరేటు శక్తులకు లాభం చేకూర్చడమే అవుతుంద విద్యావ్యవస్థలో కార్పొరేట్లకు వత్తాసు పలకడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 వేల ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేసే బదులు, 2000 పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని సిఫార్సు చేయడం ఆశాస్త్రీయం తెలిపారు. ఈ సిఫారసులు అమలు చేస్తే రాష్ట్రంలో అనేకమంది పేద వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.ఈ సిఫారసులు బడికి ఊరికి ఉన్న అనుబంధాన్ని తుంచేసే విధంగా ఉందన్నారు.అందుకే ప్రభుత్వం ఈ సిఫారసులను ఉపసంహరించుకొని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి అందరికీ ఒకే రకమైన, నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేలా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని, కొఠారీ కమిషన్ సిఫారసులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ చర్యలు ఉండాలని టీపీటీఎఫ్ గా డిమాండ్ చేశారు.లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యోగ, ప్రజా, ఉపాధ్యాయ సంఘాలతో ఐక్యంగా ఈ సిఫారలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు.

మంచి కార్యక్రమానికి నా సంపూర్ణ సహకారం

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న యాదవ విద్యార్థిని, విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో యాదవ సంఘం, యాదవ విద్యావంతుల వేదిక, యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తన వంతు సహకారంగా రూ.2 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.గతంలో ఇచ్చిన హామీ మేరకు తన నెల వేతనాన్ని విరాళంగా అందజేస్తూ, మంచి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తన సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు మరింత ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రోత్సహించడం అత్యంత అవసరమని అన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఇలాంటి అవార్డులు, పురస్కారాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగే యాదవ సంఘం చేపడుతున్న విద్యా, సామాజిక కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా నిరుపేదలకు అండగా ఉండే కార్యక్రమాలకు తన మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఐకమత్యంతో సంఘ నాయకులు, సభ్యులు తమ వంతు బాధ్యతగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరి యాదవ్, జిల్లా అధ్యక్షులు మామిళ్ళ ఐలయ్య యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు గొర్రె మల్లికార్జున్ యాదవ్, యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి అనిల్ కుమార్, కవి రచయిత ఉండాల రాజేశం, యువజన విభాగ అధ్యక్షులు బొల్లు రాము యాదవ్, శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్ అధ్యక్షులు బైరి రాములు, జక్కుల బాలమల్లు, కాటుక నరసింహులు, బొల్లమైన మహేష్, గంధం రాజు, మామిళ్ళ రాము, దాసరి రాజు, తెల్జిరి శ్రీనివాస్, కాలువ ఎల్లయ్య, గుండెలి వేణు, కుక్కల తిరుపతి, బాగు యాదగిరి తదితర నాయకులు పాల్గొన్నారు.



రైతుబంధు కోసం అన్నదాతల రాస్తారోకో

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి02 : బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణరావుపేట మండలంలోని లక్ష్మీ దేవిపల్లి గ్రామం వద్ద, సిద్దిపేట్ -ముస్తాబాద్ రహదారిపై రైతుబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారీ రాస్తారోకో ధర్నా నిర్వహించారు.అలాగే రంగనాయక సాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల ద్వారా విడుదలైన సాగునీరు నారాయణరావుపేట మండలంలోని గ్రామాలకు కాలువల ద్వారా సక్రమంగా చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో నారాయణరావుపేట మండలంలోని అన్ని గ్రామాల బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు. రహదారిపై కూర్చొని రాస్తారోకో చేపట్టి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు .ఈ కార్యక్రమం మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలి

ట్రైనింగ్ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02 : ఒక్క సీసీ కెమెరా 10 మంది జవాన్లతో సమానంగా పనిచేస్తున్నట్లు ట్రైనింగ్ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా అన్నారు. గంజాయి కి యువత దూరంగా ఉండాలని సూచించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామంలోని సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో 25 సీసీ కెమెరాలు ప్రారంభించినట్లు తెలిపారు . ఆన్లైన్ బెట్టింగుకు దూరంగా ఉండాలని సూచించారు. యువత కదలికల పైన తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. సిసి కెమెరాలు ప్రతి గ్రామంలో తప్పకుండా అమర్చుకోవాలని సూచించారు. సిసి కెమెరాలు గ్రామాల్లో అమర్చుకుంటే నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్లు తెలిపారు. గ్రామంలో మద్యపానం నిషేధం చేస్తున్నట్లు పంచాయతీ పాలకవర్గం ట్రైనింగ్ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా కు తీర్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సిఐ శీను ఎస్సై చంద్రమోహన్ మాజీ ఎంపీపీ మాణిక్య రెడ్డి మాజీ ఎంపిటిసి మల్లేశం గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.





రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 02 : హవేలీ ఘన్పూర్ మండల పరిధిలోని కూచన్ పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అభినయ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మోడల్ యునైటెడ్ నేషన్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ తెలిపారు.రెండు రోజుల క్రితం మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో జడ్.పి.హెచ్.ఎస్ కూచన్ పల్లి పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు అభినయ,సాత్విక, సహస్ర లు పాల్గొనగా 9వ తరగతి చదువుతున్న అభినయ జిల్లా స్థాయిలో మూడో స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. మెదక్ జిల్లా నుండి రాష్ట్రస్థాయికి మొత్తం 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వారిలో కూచన్ పల్లి విద్యార్థిని అభినయ ఉండడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, గైడ్ టీచర్ లు త్యార్ల శ్రీనివాస్, సందీప్ కృష్ణ లను అభినందించారు. వచ్చే నెలలో జరగబోయే రాష్ట్ర స్థాయి మోడల్ యునైటెడ్ నేషన్స్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి మెదక్ జిల్లాను అగ్రస్థానంలో ఉండే విధంగా ఉంచాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలి

విదూషి శ్రీవిద్య అంగారా, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 02 : భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి విదూషి శ్రీవిద్య అంగారా అన్నారు. ప్రముఖ స్వచంద సంస్థ స్పిక్ మాకే ఆధ్వర్యంలో అక్కెనపల్లిలోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు కూచిపూడి నృత్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కూచిపూడి నృత్యకళాకారిణి విదూషి శ్రీవిద్య అంగారా సిన్హా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూచిపూడి నృత్యం యొక్క చరిత్ర, ప్రాముఖ్యత భావాభినయాలు, హస్త ముద్రలు, తాళాల వినియోగం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చి విద్యార్థులను ఆకట్టుకున్నారు. భారతీయ సాంప్రదాయ కళల పట్ల ఆసక్తిని పెంపొందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంద జానయ్య మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను మెరుగు పరచుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీజీటీ డా. యస్. శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశం కళలకు పుట్టినిల్లు అన్ని కళలను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు సి.హెచ్.రజని, ఎ.శ్రీనివాస్, బి.ప్రభాకర్, నర్సయ్య, శ్రీనివాస్, భాను రేఖ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కళల పట్ల అవగాహన పెంపొందించడమే కాక, సాంప్రదాయ నృత్య కళల పట్ల గౌరవాన్ని పెంచింది.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 02 : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులో నల్ల పోచయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్ సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి తక్షణ సహాయంగా ఆర్థిక సహాయం తోపాటు 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ మోడల్ బుల్డోజర్ రాజ్‌ను నడిపిస్తోంది. ఖమ్మంలోని భూదాన్ భూముల్లో నిర్మించుకున్న దాదాపు 700 ఇళ్లను కూల్చివేయడం, 3వేల మంది పేదలను నిరాశ్రయుల్ని చేసి కాంగ్రెస్ తన నిజస్వరూపాన్ని బయటపెట్టింది. పేదలను పీడించే బీజేపీ విధానాలను కాంగ్రెస్ అనుసరిస్తోంది. పేదలపై చేస్తున్న ఈ దాడికి ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలి.

- కేరళ సీఎం పినరయి విజయన్

ప్రాంతీయం



మెదక్ కలెక్టర్ ప్రతిమసింగ్‌కు శుభాకాంక్షలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 02 : నూతన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమా సింగ్ ను తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సకాలంలో సేవలు అందజేసి మెదక్ జిల్లాను అగ్రస్థానంలో నిలుస్తామని నిలుపుతామని కలెక్టర్ కి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు విట్టాల్ కార్యదర్శి నాగభూషణం కోశాధికారి శ్రీనివాస్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి ,నాగరాజు బాల నరసయ్య యాదగిరి సాయిలు, రామచంద్ర రాజు స్వరూప రాథోడ్ మధులత వేణు, ఎల్లయ్య పాల్గొన్నారు.



ప్రజలు నిర్భయంగా వచ్చి కలవండి

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 02 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిరోజూ పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని మెదక్ జిల్లా ఎస్పీ డివి. శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను ఎస్పీ స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే పరిష్కార చర్యలు తీసుకునేలా సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని అంశాలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని ప్రజలను కోరారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగిందని ఎస్పీ పేర్కొన్నారు.



ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02 : సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ లో 20012002 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.వాళ్లకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. 25 సంవత్సరాల తర్వాత అందరు ఒకచోట కలిసి వాళ్ళ పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.వివిధ రంగాల్లో , వివిధ ప్రాంతాల్లో స్థిరపడి వారి జీవితంలో ఎదురైనా కష్ట నష్టాలు, సుఖసంతోషాలను అందరితో పంచుకున్నారు.. విద్యార్థి దశలో చేసిన అల్లరి పనులు, గురు శిష్యుల మధ్య వున్న సంభంద భాంధవ్యలను గుర్తు చేసుకున్నారు. కేరింతలు ఆట పాటలతో రోజంతా సందడి గా గడిపారు.



బుస్సాపూర్‌లో ప్రొద్దుతిరుగుడు సాగుపై శిక్షణ

డ్రోన్ ద్వారా బోరాక్స్ పిచికారి ప్రదర్శన

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02: బుస్సాపూర్ గ్రామంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం తోర్నాల ఆధ్వర్యంలో ప్రొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పై శిక్షణా కార్యక్రమం,ప్రొద్దుతిరుగుడులో డ్రోన్‌తో బోరాక్స్ పిచికారి విధానం పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త అధిపతి డా. జి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రొద్దుతిరుగుడు పంటలో సమతుల్య ఎరువుల వినియోగం, ముఖ్యంగా సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం గురించి వివరించారు. బోరాక్స్‌ను ఎకరాకు 400 గ్రాముల చొప్పున పిచికారి చేయడం ద్వారా తాలు గింజల శాతం తగ్గి, గింజలు పూర్తిగా కట్టుకుని అధిక దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో నెలకొన్న కూలీల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణ అవసరమని పేర్కొన్నారు. డ్రోన్ సాంకేతికతతో పిచికారి చేస్తే కేవలం 6-7 నిమిషాల్లో ఒక ఎకరానికి పిచికారి పూర్తి చేయవచ్చని, దీని ద్వారా సమయం మరియు ఖర్చు ఆదా అవుతాయని చెప్పారు.అనంతరం డా. డి. శ్వేత (శాస్త్రవేత్త - ఆగ్రో) పంటల వైవిధ్యీకరణలో నూనెగింజల ప్రాముఖ్యత, అలాగే ప్రొద్దుతిరుగుడు సాగులో అనుసరించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమం ముగింపులో రైతులు క్షేత్ర ప్రదర్శనను సందర్శించి, ప్రొద్దుతిరుగుడు పంటలో డ్రోన్ ద్వారా బోరాక్స్ పిచికారి చేసే విధానాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. డ్రోన్ వినియోగంపై రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తోర్నాల శాస్త్రవేత్తలు డా. రమాదేవి, ఎ. సరిత, జి. నీలిమ, డా. పల్లవి, డా. భాను కిరణ్ రెడ్డి, బుస్సాపూర్ సర్పంచ్ శ్రీ ఐల రెడ్డి అనేక మంది రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 02 : ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని, మండల స్థాయిలో ప్రజావాణి యధాతధంగా కొనసాగుతుందని, శాఖల వారీగా పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని, అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి, అనంతరం అధికారులతో శాఖల వారీగా పనితీరుపై సమీక్షించారు.ముందుగా ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు తమ సమస్యలను కలెక్టర్కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని ప్రతి సోమవారం ప్రజల సమస్యలపై ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని మండల స్థాయిలో ప్రజావాణి యధాతధంగా కొనసాగుతుందని ప్రజలు అందించిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు పరిష్కార దిశగా కృషి చేయాలని ఆదేశించారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, వివిధ అంశాలపై ప్రజలునుడి 74 దరఖాస్తుల సమర్పించారని తెలిపారు. ప్రజలు అందించిన దరఖాస్తులపై అర్హత మేరకు పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆదేశించారు.అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో శాఖల వారీగా అభివృద్ధి సంక్షేమ పథకాల పనితీరు పై చర్చించారు. చిత్తశుద్ధితో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు. ప్రత్యేక చొరవ చూపాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ యూనస్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు హోళీ శుభాకాంక్షలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 02:: హోళీ పండుగను పురస్కరించుకుని కలెక్టర్ ప్రతిమా సింగ్ జిల్లా ప్రజలకు హోళీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హోళీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హోళీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హోళీ నిర్వహించుకోవాలని హితవు పలికారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

రామాయంపేట మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కి తరలి వెళ్లారు.. భూ నిర్వాసితులకు సరైన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ ప్రతిమసింగ్ కు వినతిపత్రం సమర్పించారు. గతంలో తమకు మార్కెట్ విలువలతో సమానంగా నష్టపరిహారం చెల్లిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 2017 సంవత్సరంలో మార్కెట్ ధర గజంకు 7000 రూపాయలు ఉండగా, దానికి మూడంతలుగా గజంకు 21000 నష్టపరిహారం చెల్లించాల్సింది పోయి, అధికారులు కేవలం 2100 మాత్రమే చెల్లిస్తున్నారని మండిపడ్డారు. ఎకరం భూమి విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయలు పలుకుతుండగా.. కేవలం ఎనిమిది లక్షల రూపాయల నష్టపరిహారమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బహిరంగ మార్కెట్ తో సమానంగా నష్టపరిహారం చెల్లించాలని లేనిపక్షంలో తాము బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వమని కలెక్టర్కు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలోరామాయంపేట కౌన్సిలర్ గజవాడ నాగరాజు, మాజీ కౌన్సిలర్ అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు చింతల యాదగిరి, భూమి బాధితులు దోమకొండ రాములు, ఎర్రం నాగరాజు, దోమకొండ యాదగిరి, బైరం అర్జున్, బైరం స్వామి, మోతుకు అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మెదక్ జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 02 : మెదక్ జిల్లా ప్రజలకు మాజీ డిప్యూటీ స్పీకర్,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మదేవేందర్ రెడ్డి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.రంగుల పండుగ హోలీ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు ఆనందాన్ని నింపాలని ఐక్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. హోలీ పండుగను ఆనందంగా సురక్షితంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.సహజ సిద్ధమైన రంగులతో సాంప్రదాయ పద్ధతులతో రంగుల పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

కత్తుల నర్మదకు నంది అవార్డు

- బ్యూటీషన్ రంగంలో ఉత్తమ ప్రతిభ
- నాడు సైమా, నేడు నంది అవార్డు

ప్రతిపక్షం, చేర్యాల, మార్చి 02 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన బ్యూటిషన్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిద్దిపేట జిల్లా చేర్యాల మండల పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కత్తుల నర్మద నంది అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని బీర్ల మందిరంలోని భాస్కరాచార్య ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన నంది అవార్డుల ప్రధానోత్సవంలో సినీ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా కత్తుల నర్మద బ్యూటిషన్ రంగంలో నంది అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కత్తుల నర్మద మాట్లాడుతూ... ఏ రంగంలో అయినా పట్టుదలతో సమయస్ఫూర్తితోకష్టపడి పని చేస్తేనే గుర్తింపు వస్తుందని ఆమె అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కష్టపడి నేర్చుకొని పని చేస్తున్నానని తెలిపారు. మనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని కష్టాన్ని ఇష్టపడి పని చేస్తే ఏ రంగంలో అయినా ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించవచ్చని అన్నారు. బ్యూటిషన్ రంగంలో తనను గుర్తించి, ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో నంది అవార్డు ఇచ్చి ప్రోత్సహించిన శైలజ రెడ్డి, మౌనికలకు ధన్యవాదాలు తెలిపారు.





కనుల పండువగా బీరప్ప కల్యాణం

- పాల్గొన్న బీఆర్ఎస్ నేత తిరుపతిరెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 02 : హవేళిఘనపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి కామరాతి దేవిల కళ్యాణ మహోత్సవంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి కంఠ రెడ్డి. తిరుపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్రీ బీరప్ప ఆలయంలో బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించడం శుభదాయకమని అన్నారు. బీరప్ప స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కురుమ సంఘం నాయకులు కంఠరెడ్డి. తిరుపతి రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ నార్ల. సాయిలు,హవెలిఘనపూర్ మాజీ వైస్ ఎంపీపీ రాధాకిషన్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి, సర్పంచ్ మ్యాకల సాయిలు, మాజీ సర్పంచ్ లు యమిరెడ్డి, సాయగౌడ్,కిషన్ నాయక్,మాజీ ఎంపీటీసీలు సిద్దిరెడ్డి మాజీ పీఏసీఎస్ చైర్మెన్ శ్రీహరి, మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ గౌస్, నాయకులు చంద్రమోహన్ గౌడ్, సుదర్శన్ రెడ్డి,శేఖర్ రెడ్డి, బిక్షపతిరెడ్డి,రాజేందర్ రెడ్డి , రాజేశ్వర్ రావు,తలారి సంతోష్, వడ్ల నాగరాజు,సంతోష్ గౌడ్ , వినయ్, రాములు,చెత్రి మల్లయ్య, చిరంజీవి రెడ్డి, కురుమ సంఘం నాయకులు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అదనపు ఎస్పి జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 02 : మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ డీవి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో అదనపు ఎస్పి ఎస్. మహేందర్ 61వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ చేత ఎస్పీ డీవి శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది కేక్ కట్ చేయించి, తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ సుదీర్ఘ సేవ ప్రస్థానంలో నిజాయితీ క్రమశిక్షణ మానవనీయ విలువలతో విధులు నిర్వహిస్తూ శాఖలో మంచి పేరు సంపాదించుకున్న అదనపు ఎస్పీని అభినందించారు.నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పి ప్రసన్నకుమార్, సిఐలు రాజశేఖర్ రెడ్డి,సందీప్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గోమాత నామకరణ మహోత్సవం



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02 : గోమాతను రక్షిస్తే భూమాత మనల్ని రక్షిస్తుందని మాజీటిటిడి బోర్డు మెంబర్ మొరంశెట్టి రాములు, యాదగిరి స్వామీజీ అన్నారు. గోమాతలో 33 కోట్ల దేవతలు నిక్షిప్తమై ఉంటారని ఒక గోవుకు పూజ చేస్తే 33 కోట్ల మంది దేవతలకు పూజ చేసినట్లేనని వారు తెలిపారు. ప్రజలు ఇళ్లల్లో అపార్ట్మెంట్లలో కుక్కలను పెంచడం మాని గోమాతను పెంచాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కైలాసగిరి గోశాలలో పుంగనూరు గోమాతకు నామకరణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోమాతకు తొట్లే కార్యక్రమం నిర్వహించి బాలాజీ అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోమాతలకు సేవ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాత నుండి లభ్యమయ్యే పాలు, పేడ, పంచకం వంటివి ఎంతో ఉపయోగకరమైనవన్నారు. గోమాత సేవ చేస్తే సర్వ పాపాలు తొలగి సకల సిద్దులు వరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు గోమాతను రక్షించి, గోమాతలకు సేవ చేయాలని కోరారు.

“



ఇరాన్‌తో యుద్ధాన్ని తాము మొదలు పెట్టలేదు. కానీ ముగించేది మాత్రం తామే. ఇరాన్‌పై జరిగిన ఏరియల్ ఆపరేషన్ చరిత్రలో అత్యంత సంక్లిష్టమైన, కచ్చితమైనది. ఇరాన్ వంటి ప్రభుత్వాలు అణ్వాయుధాలు కలిగి ఉండకూడదు. అమెరికన్లను చంపే, బెదిరించే ఎవరినైనా వేటాడుతాం. ఇది అంతులేని యుద్ధంగా మారదు. కానీ ఇరాన్‌లో ప్రభుత్వం మారుతుంది.

- అమెరికా డిఫెన్స్ సెక్రటరీ పీట్ హెగ్సేత్

ప్రాంతీయం

పేదల ఇండ్లు మీరు కూలిస్తే..
పెద్దల ఇండ్లను కూల్చి వేస్తాం

- బాన్సువాడ బాధితులకు అండగా ఉంటాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 02 : బఫర్ జోన్, ఎఫ్ టీఎల్ పేరుతో ఇకపై పేదల ఇండ్లు మీరు కూలిస్తే...అదే ప్రాంతంలోని పెద్దల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చి వేస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. బాన్సువాడలో ఇటీవల జరిగిన సంఘటనలో అక్రమంగా కేసులకు గురై జైలు పాలైన అమాయకుల కుటుంబ సభ్యులను అయన కామారెడ్డిలో స్వయంగా కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. "మీకు మేము ఉన్నాం... ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా ధైర్యంగా ఉండాలి" అంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమైతే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఒవైసీ అక్రమంగా నిర్మించిన ఫాతిమా కాలేజీ కూల్చడానికి పరీక్షలు అడ్డు వస్తే.. ఖమ్మంలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల భవిష్యత్తు గుర్తుకురాలేదా? అన్నారు. పేదలకు ఒక న్యాయం... ఒవైసీ కాలేజీకి మరో న్యాయమా? అని, ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే బాన్సువాడలో హిందువులను జైల్లో వేస్తారా? అని ప్రశ్నించారు. హిందూ దేవాలయాలపై దాడులు చేస్తూ అమాయకులను వేధిస్తున్నారా?హిందువులారా... ఇంకెన్నాళ్లు కాంగ్రెస్, మజ్లిస్ అరాచకాలను భరిద్దాం? హిందువులంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం రండి అని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తల ఓపికను చేతగానితనంగా భావిస్తే గుణపాఠం తప్పదని, రాహుల్ గాంధీ... శిక్షణా తరగతులకు కాదు...బాధిత ప్రాంతాల్లో పర్యటించండని అన్నారు. రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చేది మూటల కోసమే, మూసీ పరిధిలో పేదల ఇండ్లను కూల్చి పెద్దలతో బేరాలాడుతున్నారని అన్నారు. గాంధీ విగ్రహం పేరుతో పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గం, గాంధీ ఆత్మ క్షోభిస్తోందని, గుజరాత్ లో సర్దార్ పటేల్ విగ్రహం నిర్మించి మోదీ ప్రభుత్వం ప్రజల మనసులను దోచుకుందని అన్నారు.రాష్ట్రంలో గాంధీ విగ్రహం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఉసురు తీస్తోందని, అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల ఏ దేశంతో యుద్ధం వస్తుందో రాహుల్ సమాధానం చెప్పాలన్నారు.కాంగ్రెస్ లోనే అంతర్యుద్ధం మొదలైన సంగతి రాహుల్ గుర్తుంచుకోవాలని, కాంగ్రెస్ తో జరిగిన యుద్ధంలో ప్రజలు దేశవ్యాప్తంగా ఆ పార్టీని బొంద పెట్టారని, మూడు రాష్ట్రాలకే కాంగ్రెస్ ను పరిమితం చేశారని అన్నారు.బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు బయట కూడా తిరగలేరని, కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిప్పులు చేరిగారు. నేను ఇతర మతాల జోలికి వెళ్లను. హిందువుగా మాట్లాడుతున్నా. హిందువులపైన, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడుల గురించి మాట్లాడుతున్నా. నేను హోంశాఖ సహాయ మంత్రినైనా సరే... హిందువుగానే మాట్లాడుతున్నా. కాంగ్రెస్ ప్రభుత్వ హిందూ వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. రాజకీయాలకు అతీతంగా కాషాయ జెండాను పట్టుకుని ఐక్యంగా హిందూ వ్యతిరేక విధానాలపై పోరాడదాం రండి. లేనిపక్షంలో చరిత్ర హీనులుగా మిగిలిపోతామన్నారు. అయన వెంట బీజేపీ నాయకులు ఎండల లక్ష్మీనారాయణ, పండ్ల రాజు, దినేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఎర్రగట్టు జాతర ప్రారంభం



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 02 : హసన్‌పర్తి మండలంలోని శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి జాతర హోలీ పర్వదినాన జరుగుతుంది ప్రారంభమై ఐదు రోజులపాటు రంగ రంగ వైభవంగా జరుగుతుంది. ప్రతి సంవత్సరం లక్షలాదిగా భక్తులు తరలివచ్చి వారి ఇలవేల్పైనా శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు మంగళవారం రోజు ప్రారంభమయ్యే శనివారం వరకు ఈ జాతరకు అశేషమైన భక్తజనం హాజరవుతారు నేడే ప్రారంభమవుతున్న ఈ జాతరలో దేవాదాయ శాఖ అనుకున్నంత మేర ఏర్పాట్లు చేయలేకపోయింది స్థానిక ఎమ్మెల్యే నేటి వరకు దేవాదాయశాఖ సంబంధించి కమిటీని వేయకపోవడం గమనార్హం గత మూడు సంవత్సరాలుగా ఈ జాతరకు దేవదాయ శాఖ ఎండోమెంట్ కమిటీని వేయాల్సి ఉండే అయినప్పటికిని ఇప్పటికీ ఉత్సవ కమిటీని కూడా వేయలెకపోవడం భక్తులకు నిరాశ పరుస్తుంది హసంపర్తి భీమారం రెండు గ్రామాల ప్రజలు హోలీ సందర్భంగా జాతరలొ నిమగ్నమై ఉంటారు. ఈ జాతర ఎంతో విశేషంతో కూడుకున్నది వందల సంవత్సరాలుగా శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి జాతర బ్రహ్మాండంగా జరుగుతుంది హోలీ పండుగ దినాన ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొమ్మాల జాతర కోటంచ జాతర ఎర్రగట్టు జాతర మూడు జాతరలో భక్తులు దేవదర్శనలకు వెళ్ళేందుకు లక్షల సంఖ్యలో కుటుంబ సమేతంగా హాజరై వారి వారి ఇలవేల్పు దేవుళ్లను దర్శించుకుంటారు. కొమ్మాలకోటంచలో దేవాదాయ శాఖ అనుకున్న మేర భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనేక ఏర్పాటు చేసింది ఎర్రగట్టు జాతరలో ఇప్పటికీ వందలాది దుకాణంలో టెంటులు వేసుకొని ఉన్నారు. జిల్లాలోని భక్తులు వచ్చి తమ ఇలవేల్పు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఐదు రోజులపాటు జరిగే ఈజాతర భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిందిగా భక్తులు కోరుకుంటున్నారు హోమ్ విద్యుత్తు రెవెన్యూ వైద్యం సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

ఇంచార్జి అదనపు కలెక్టర్‌గా దిలీప్ కుమార్ బాధ్యతలు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 02 : నిజామాబాద్ జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ గా(స్థానిక సంస్థలు) దిలీప్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ఐ.ఏ.ఎస్ అధికారి అంకిత్ కు పదోన్నతి కల్పిస్తూ ఇటీవలే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా బదిలీ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ గా నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించిన మీదట, మర్యాద పూర్వకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఇంచార్జి అదనపు కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్ ను పలువురు జిల్లా అధికారులు కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



ధాన్యం సేకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 02 : 2025-26 రబీ వరి సేకరణ కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. 2025-26 రబీ సీజన్ కు సంబంధించిన వరి సేకరణ కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, సమయపాలనతో కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సాగు విస్తీర్ణం & ఉత్పత్తి అంచనా, జిల్లాలో ఈ రబీ సీజన్‌లో గణనీయమైన విస్తీర్ణంలో వరి సాగు చేయబడినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసిందని, హెక్టారుకు సగటు దిగుబడి ఆధారంగా మొత్తం ఉత్పత్తి అంచనా ప్రకారం, మార్కెట్ రాకపోకలు స్థానిక వినియోగం , విత్తన అవసరాలను మినహాయించి, మిగిలిన వరి మార్కెట్‌కు రానుందని. వరి మార్కెట్‌లోకి మార్చి చివరి వారంలో వస్తుందని ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని పేర్కొన్నారు. కొనుగోళ్ల వివరాలు, అవసరమైన గన్నీ సంచులు, తేమ కొలిచే యంత్రాలు, హామీ ధర చెల్లింపుల కోసం సాంకేతిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగునీరు, నీడ, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని, కేంద్రాలలో వైద్య సిబ్బందిని నియమించి ORS ప్యాకెట్లు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తేమ శాతం నిబంధనల ప్రకారం మాత్రమే కొనుగోలు చేపట్టాలని రైతులకు చెల్లింపులు నిర్దిష్ట కాలపరిమితి లో వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని, రవాణా, నిల్వ సదుపాయాలు ముందస్తుగా సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లై అధికారి, వెంకటేశ్వర్లు, DM శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, రైస్ మిల్లర్ల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ ప్రజావాణికి
34 ఫిర్యాదులు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 02 : పోలీస్ ప్రజావాణి కి 34 ఫిర్యాదులు వచ్చాయి. నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్చందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.



హిందూ పండగలలో విశిష్టమైన పండగ హోలీ

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 02 : హిందూ పండగలు ఎన్ని ఉన్నప్పటికీ దేని విశిష్టత దానికే ఉంటుందని అందులో ముఖ్యంగా హోలీ పండగ కు ప్రత్యేక స్థానం ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి నిజామాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కామ దహన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నగర ప్రజలు సుఖ సంతోషాలతో మరియు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. మంగళవారం రోజున చంద్రగ్రహణం ఉండటం వల్ల కామ దహన కార్యక్రమాన్ని ప్రజలు సోమవారం రోజునే నిర్వహించుకుంటున్నారని కానీ పట్టణ ఆర్యవైశ్య సంఘం వారు ఒక రోజు ముందుగానే నిర్వహిస్తారని ఆయన తెలిపారు. హోలీ పండగకు ప్రత్యేక స్థానం ఉందని, చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు కలిసిమెలిసి ఐక్యంగా ఈ పండగను ఘనంగా జరుపుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ సంతోషంగా నిర్వహించే ఒకే ఒక్క పండగ ఈ పండగ. ముఖ్యంగా చిన్నారులకు హోలీ పండగ అంటే ఎంతో ఇష్టమని ఆయన అన్నారు. రంగులు ఆడేటప్పుడు చిన్నారులు జాగ్రత్త వహించాలని వారి తల్లిదండ్రులు దగ్గరుండి పిల్లలను గమనించాలని కోరారు. ఈ హోలీ పండగను ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం వారు ప్రతీ సంవత్సరం కామ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తూ ఉంటారని ఇందులో తాను కూడా హాజరవుతానని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇందూరు ప్రజలకు హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముక్కా దేవేందర్ గుప్తా, పాల్దే లక్ష్మీకాంతం, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు ధన్ పాల్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్, కమిటీ సభ్యులు, మహిళా సంఘం కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ సంస్థల గల్లీ సంఘాల అధ్యక, కార్యదర్శులు పట్టణ ఆర్యవైశ్య సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

పశ్చిమ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 02 : కాజీపేట వరంగల్ పశ్చిమ నియోజకవర్గం దర్గా రైల్వే గేట్ నుంచి కడిపికొండ వరకు రోడ్డు మార్గం సుగమం ఒకే రోజు రూ.9.37 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు తెలిపారు. సోమవారం రోజున 48, 49 డివిజన్ల పరిధిలో సుమారు రూ.9.37 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు రూ.7.50 కోట్ల వ్యయంతో NIT నుంచి లోటస్ కాలనీ వరకు R&B రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ రహదారి రెండు వైపులా సెంటర్ లైటింగ్ వ్యవస్థతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు అదేవిధంగా 48వ డివిజన్‌లో రూ.50 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, రూ.1.37 కోట్లతో లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూర్ పాషా,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కూడా పాల్గొన్నారు అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. శంకుస్థాపనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న NIT రహదారి పనులు ప్రారంభం కావడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు.గతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఎవరు పట్టించుకోలేదని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులను సమకూర్చి ప్రత్యేక దృష్టితో ఈ రోజు పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు కాజీపేట దర్గాలో గల గాంధీ నగర్ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న స్మశాన వాటిక రోడ్డు కోసం దర్గా పీఠాధిపతి కుసురు పాషా గారుని ఒప్పించి రోడ్డు ఏర్పాటు స్థలాన్ని కేటాయించడం జరిగిందని తద్వారా ప్రజలకు రోడ్డు సౌకర్యం మెరుగుపడుతున్నదని అన్నారు అన్ని డివిజన్లలో అంతర్గత రోడ్లు సీసీ డ్రైనేజీ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కాజీపేట దర్గా పరిసర ప్రాంతాలు దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఇప్పుడు ఆ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. దర్గా రైల్వే ట్రాక్ అవతల నివసించే ప్రజల గేట్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.దర్గా రైల్వే గేట్ నుంచి కడిపికొండ వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ పనులను సుగుమం చేశామన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినా ప్రజా అభివృద్ధినే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేసే మాయమాటలను నమ్మకుండా, పనిచేసే వారిని గుర్తించి భవిష్యత్తులో ఆశీర్వదించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మానస రాంప్రసాద్, సత్రాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబూబకర్, సీనియర్ నాయకులు అమర్, కట్ట రఘుపాల్ రెడ్డి, మట్టెడా కుమార్, డివిజన్ అధ్యక్షులు సింగరపు రవి ప్రసాద్, మల్లారెడ్డి తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులందరూ
హాజరు కావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి


ప్రతిపక్షం, నిజామాబాద్, మార్చి 02 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఇంచార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దిలీప్ కుమార్ తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 83 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. అయితే ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజర్ అయ్యారు. దీనిని గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గైర్హాజర్ అయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





గర్భాశయ క్యాన్సర్ నివారణకు కృషి

ప్రతిపక్షం, మంచిర్యాల, మార్చి 02 : మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం కృషి అయినదని అదనపు కలెక్టర్ చంద్రయ్య శ్రీనివాస్ రెవెన్యూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని బాలికలకు ఈ కార్యక్రమంలో వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్టు తెలిపారు ఒక డోసు ఎడమ చేతికి వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత చూపుడు వేలికి గుర్తింపు కోసం ఇంకు పెడతామని అన్నారు ఈ కార్యక్రమం మూడు నెలల పాటు ఉంటుందన్నారు తర్వాత ఈ కార్యక్రమాన్ని జాతీయ టీకాల కార్యక్రమంలో కనపడునట్లు తెలిపారు వ్యాక్సిన్ వేయించుకునే పిల్లలు ఆయా పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు వ్యాక్సిన్ వేసే ముందు పిల్లలు టిఫిన్ లేదా భోజనం చేసి ఉండాలని అన్నారు వ్యాక్సిన్ అనంతరం అరగంట పాటు కేంద్రంలోని ఉండాలన్నారు ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను విడుదల చేశారు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని నిర్వహించినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి ఒక్క వెంకటేశ్వర్లు, డిపిఓ ప్రశాంతి, సిహెచ్ఓ లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ స్వామి, పద్మ పాల్గొన్నారు.



అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదు. చర్చల పునరుద్ధరణకు తమ నుంచి ప్రతిపాదనలు వచ్చాయంటూ వచ్చిన వార్తలు అవాస్తవం. ఈ యుద్ధాన్ని మేం మొదలు పెట్టలేదు. ట్రంప్ తన తప్పుడు ఆకాంక్షలతో ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెట్టేశారు. ఇజ్రాయెల్ కూడా తన అధికార కాంక్షతో అమెరికా సైనికులను కూడా బలి పెడుతున్నది. ఇజ్రాయెల్ ఆధిపత్య లక్ష్యాల కోసం అమెరికా అధ్యక్షుబు ట్రంప్ తమ సైనికులను పణంగా పెడుతున్నారు.
- ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లరిజానీ



బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 02 : అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్ప వని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రశ్మి పెరుమాళ్ హెచ్చరించారు. సోమవారం రాత్రి దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి వార్డులో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో దుబ్బాక పోలీస్ సిబ్బందితో కలిసి దుంపలపల్లి వార్డులో అక్రమంగా మద్యం నిల్వ చేసి, విక్రయిస్తున్న రెండు బెల్ట్ షాపులపై దాడి చేసి, 20 లీటర్ల లిక్కర్ ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే వారిపై ఉక్కు పాదం మోపుతామని, అక్రమంగా మద్యం విక్రయించే వారిపై తప్పనిసరిగా పోలీసు నిఘా ఉంటుందన్నారు. మద్యం బెల్టు అమ్మకాల్లో దొరికితే వారిపై కేసులతోపాటు జరిమానా విధించడం, చివరికి బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టేందుకు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. దాడుల్లో దుబ్బాక సిఐ టి.రాజేష్, ఎస్ఐ కీర్తిరాజు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్య



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 02 : గ్రామాల సర్వతో ముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతా యుతంగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు (నాలుగు మండలాలకు చెందిన 4వ బ్యాచ్) నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్పంచులను ఉద్దేశించి మాట్లాడుతూ,శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో గ్రహించి, శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలు గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామానికి మంచి చేయాలన్న, గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న సమస్యలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా పరిష్కరించాలి, అందుబాటులో ఉన్న నిధులను ఎలా సక్రమంగా వినియోగించుకోవాలి వంటి అంశాలపై ఈ శిక్షణ ద్వారా స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యతని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించి, ప్రాధాన్యత ఆధారంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను మార్చి 31 లోగా పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వేసవి కాలంలో నీటి సరఫరా సవ్యంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు సంబంధించిన మెటీరియల్‌తో కూడిన బ్యాగులను జిల్లా కలెక్టర్ సర్పంచులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు, డి.డబ్ల్యూ.ఓ లలిత కుమారి ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



రామకోటి ఆధ్వర్యంలో 'గోటి తలంబ్రాలు'

పుల్లూరు త్రికుటేశ్వరాలయం నుంచి భద్రాచలానికి తలంబ్రాలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02: సిద్ది పేట జిల్లా జిల్లా పుల్లూరు గ్రామంలోని త్రికుటేశ్వరాలయంలో భద్రాచల రాములోరి కళ్యానానికి అందించే గోటి తలంబ్రాల కార్యక్రమం కోటి తలంబ్రాల దీక్ష సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భద్రాచలం నుండి తీసుకొచ్చిన గోటి తలంబ్రాలు కలశాలలో నింపి రామనామ స్మరణ చేసుకుంటూ పురవీధుల గుండా కాషాయ జెండాలు, కలశాలతో భారీ ర్యాలీతో దేవాలయానికి చేరుకొని వడ్లను ఓలిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామకోటి రామరాజు భక్తులచే 3గంటల పాటు రామనామ స్మరణ చేయిస్తూ గోటితో వడ్లను ఓలిచి తలంబ్రాలుగా మార్చారు. భక్తులు అక్కడే రామకోటి రామరాజుకు అందజేశారు. 4సారి కళ్యానానికి 3క్వింటాల గోటి తలంబ్రాలు తెలంగాణ రాష్ట్రం నుండి అందిస్తూన్నామని రామకోటి రామరాజు తెలిపారు. మేము భద్రాచలం వెళ్లలేక పోయిన కూడా, మేము ఓలిచే తలంబ్రాలు భద్రాచల కళ్యానానికి వెళ్లడం ఎన్నో జన్మల పుణ్యఫలం అన్నారు. ఇంతటి అదృష్టాన్ని కలగజేసిన రామకోటి రామరాజు ఆలయ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయం నిర్వాహలు బాలకిషన్, భక్త బృందం పాల్గొన్నారు.

శిశు సంరక్షణకు ప్రాధాన్యం..

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 02: జిల్లాలో చిన్నారుల సంరక్షణ, దత్తత ప్రక్రియ వేగవంతం చేయడం మరియు వయోవృద్ధుల సంక్షేమ సేవలను మరింత మెరుగుపరచడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సోమవారం మహిళా ప్రాంగణంలోని శిశు గృహ కేంద్రం మరియు ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, సేవలపై ఆరా తీసి, వృద్ధులకు అందుతున్న సదుపాయాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న ఏడుగురు చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న పోషకాహారం (ఫీడింగ్), వైద్య సేవలు తదితర అంశాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల దత్తత ప్రక్రియపై విచారణ చేయగా, దత్తత ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.శిశు గృహం ద్వారా చిన్నారులకు మంచి ఆరోగ్య సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. చిన్నారుల అవసరాలకు సంబంధించిన ఏవైనా అంశాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం అక్కడే నిర్వహిస్తున్న వయోవృద్ధుల డే కేర్ (ప్రణామ్) సెంటర్‌ను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా వయోవృద్ధులకు అందుతున్న సేవలపై అక్కడున్న వృద్ధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.





ప్రజావాణి సమస్యలకు ప్రాధాన్యత నివ్వాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి,, మార్చి 02 : ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ల ఉమహారతి తో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, తదితర అంశాలతో పాటు పంచాయతీరాజ్ ఇంజనిరింగ్, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, డి డబ్ల్యు ఓ, డి సి ఎస్ ఓ, పశుసంవర్ధక, శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి లో 56 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్జి దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, ప్రజలు, పాల్గొన్నారు.



సిద్దిపేట సురక్ష నేత్రతో జిల్లా భద్రతకు కొత్త దిశ

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 02 : సిద్దిపేట జిల్లాలో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో "సిద్దిపేట సురక్ష నేత్ర" పేరుతో సమగ్ర సీసీటీవీ ఆధారిత భద్రతా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ తెలిపారు. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ కమ్యూనిటీ పోలీసింగ్ ను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ... ప్రజా భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నేరాల నివారణ, వేగవంతమైన దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ, మహిళలు మరియు పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని "సిద్దిపేట సురక్ష నేత్ర"ను రూపకల్పన చేశామని తెలిపారు. మొదటి దశలో భాగంగా జిల్లావ్యాప్తంగా 200కు పైగా సీసీటీవీ కెమెరాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసి ప్రారంభించామని వెల్లడించారు. గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ముఖ్య కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు మరియు నేరాలకు అవకాశం ఉన్న సున్నిత ప్రాంతాల్లో ఈ కెమెరాలను అమర్చినట్లు చెప్పారు.క్రమంగా జిల్లా పరిధిలోని అన్ని గ్రామాలు, మండలాలను ఒకే నిఘా వ్యవస్థ కిందకు తీసుకురావడమే లక్ష్యమని సిపి స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలు, మండలాలు తమ పరిధిలో సీసీటీవీ నెట్ వర్క్‌ను విస్తరించడంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, వ్యాపార సంస్థలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, పెట్రోల్ బంకులు, కార్యాలయాలు తమ ప్రాంగణాల్లో కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గృహ యజమానులు తమ ఇళ్ల వద్ద ప్రవేశ మార్గాలపై సీసీటీవీలు ఏర్పాటు చేసి నేరాల నివారణలో సహకరించాలని కోరారు.పోలీసు శాఖ కెమెరాల అమరికకు సంబంధించిన సాంకేతిక ప్రమాణాలు, సరైన స్థానాల ఎంపిక, నెట్ వర్క్ అనుసంధానం, నిర్వహణ మరియు డేటా భద్రతపై మార్గదర్శకత్వం అందిస్తుందని ఆమె తెలిపారు. నిరంతర నిఘా ద్వారా నేరస్థులలో భయం కలిగి నేరాలు తగ్గుతాయని, రికార్డు అయిన దృశ్యాలు దర్యాప్తులో కీలక సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సాంకేతికతతో కూడిన కమ్యూనిటీ పోలీసింగ్‌లో సిద్దిపేటను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ ముందుకు రావాలని సిపి రష్మీ పెరుమాళ్ పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో "సిద్దిపేట సురక్ష నేత్ర" పోలీసింగ్ వ్యవస్థలో పారదర్శకతను, ప్రజల నమ్మకాన్ని పెంచే మైలురాయిగా నిలుస్తుందన్నారు.



సిద్దిపేటలో కౌన్సిలర్ బ్రహ్మం ఆధ్వర్యంలో కామన్ రోడ్డు లో కాముని దహనం నిర్వహిస్తున్న స్థానికులు

రసాయన శాస్త్రంలో శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 02 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీనివాస్ నక్కా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఎల్సీఎంఎస్ పద్ధతి కోసం వ్యూహాత్మక విధానాలు AQbD, గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలను ఉపయోగించి ఫార్మాస్యూటికల్స్ లో NDSRIల అభివృద్ధి' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆధునిక ఔషధ తయారీలో కీలకమైన భద్రతా సమస్య అయిన నైట్రోసమైన్ ఔషధ పదార్థ సంబంధిత మలినాలను (NDSRI) గుర్తించడం, నియంత్రించడంపై డాక్టర్ శ్రీనివాస్ పరిశోధన దృష్టి సారించినట్టు తెలియజేశారు. సిప్రోఫ్లోక్సాసిన్, మోక్సిఫ్లోక్సాసిన్ వంటి యాంటీబయాటిక్స్, అసెక్లోఫెనాక్, మెఫెనామిక్ యాసిడ్ వంటి యాంటీ ఇన్ఫ్లమేటరీ ఔషధాలు, ఆల్ఫా 1 బ్లాకర్ టామ్సులోసిన్ వంటి కీలకమైన ఔషధ తరగతులలో NDSRI లను లెక్కించడానికి వీలుగా అత్యంత సున్నితమైన UPLCMC/MS పద్ధతులను ఈ అధ్యయనంలో అభివృద్ధి చేసినట్టు వివరించారు. ఇవి సురక్షితమైన మందులని, నియంత్రణకు ఉపకరిస్తాయన్నారు. డాక్టర్ శ్రీనివాస్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించే ప్రభావవంతమైన పరిశోధనలకు గీతం నిబద్ధతను ఈ విజయం ప్రతిబింబిస్తోందని తెలిపారు.



సీఎం కప్‌లో మెరిసిన సంగారెడ్డి ఈతగాళ్లు

రెహమాన్, ఉజైర్‌కు రజత, కాంస్య పతకాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 02 : రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో సంగారెడ్డి జిల్లా విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ విశిష్ట విజయాలు సాధించారు. ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెండవ ఎడిషన్ సీఎం కప్-2025 స్విమ్మింగ్ పోటీలలో మహమ్మద్ అబ్దుర్ రెహమాన్, ఉజైర్ పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో నిలబెట్టారు. సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని శ్లోకా శ్రీవాణి హై స్కూల్‌కు చెందిన విద్యార్థి ముహమ్మద్ అబ్దుర్ రహమాన్ సిద్దిఖ్ గ్రూప్-2 విభాగంలో 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ పోటీలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే కరుణ హై స్కూల్‌కు చెందిన విద్యార్థి ఉజైర్ గ్రూప్-3 విభాగంలో బ్రెస్ట్ స్ట్రోక్ పోటీలో రజత పతకం, ఫ్లై ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించి ద్విగుణ విజయాన్ని నమోదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య విజేతలను అభినందిస్తూ వారి చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. అదనపు కలెక్టర్ మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడం సీఎం కప్ యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అఖిలేష్ రెడ్డి క్రీడాకారులను అభినందిస్తూ, క్రమబద్ధమైన సాధనతో ముందుముందు జాతీయ స్థాయిలోనూ రాణించాలని సూచించారు. కఠినమైన పోటీ వాతావరణంలో శ్రద్ధ, పట్టుదలతో పోటీపడి ఈ విజయాలను అందుకోవడం అభినందనీయమని అన్నారు. జిల్లా స్విమ్మింగ్ ఇంచార్జ్ శేషు కుమార్ కూడా విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఇతర జాతీయ స్థాయిలోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. అలాగే జిల్లా యువజన, క్రీడా కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సి.ఎం. కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో కూడా అద్భుత ప్రతిభ కనబర్చిన పలువురు క్రీడాకారులను సైతం కలెక్టర్ సన్మానించారు.





ఇరాన్-ఇజ్రాయెల్ వార్ వల్ల దుబాయ్‌లో చిక్కుకుపోయిన మేమంతా దుబాయ్‌లో సేఫ్‌గా ఉన్నాం. అప్పుడప్పుడు దూరంగా శబ్దాలు వినిపిస్తున్నా.. ఇక్కడ లైఫ్ నార్మల్ గానే ఉంది. ఇంతటి టెన్షన్ టైమ్‌లోనూ యూఏఈ ప్రభుత్వం చూపిస్తున్న లీడర్‌షిప్, ఇక్కడి సెక్యూరిటీ అరేంజ్‌మెంట్స్ చాలా బాగున్నాయి. యూఏఈ అధికారులకు కృతజ్ఞతలు. మాకోసం ప్రార్థించిన వారికి ధన్యవాదాలు.

- టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు

ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 2: పశ్చిమ ఆసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులపై భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ చర్చించింది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరిలో రెండు రోజుల పర్యటన తర్వాత రాత్రి తొమ్మిదిన్నర గంటలకు దిల్లీ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతి తర్వాత పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను ఈ భేటీలో సమీక్షించారు. సభ్యులు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ప్రధాని మోదీ ముఖ్య కార్యదర్శులు పీకే మిశ్రా, శక్తికాంతదాస్, సీడీఎస్ అనిల్ చౌహాన్, కేబినెట్ కార్యదర్శి సోమనాథన్, విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్త్రీ ఈ సమావేశంలో పాల్గొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, భారత్‌పై వాటి ప్రభావాన్ని ఉన్నతాధికారులు ఈ భేటీలో వివరించినట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలోని భారతీయుల భద్రత, దుబాయ్, దోహా, ఆ ప్రాంతంలోని ఇతర విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన వారితోపాటు పరిస్థితులు మరింత విషమిస్తే ఎలా వ్యవహరించాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ మేరకు ఫిబ్రవరి 28న ఇరాన్‌లో సహా



ఇతర అనేక గల్ఫ్ దేశాల్ల జరిగిన దాడులతో తదనంతరం పరిస్థితిపై కమిటీ చర్చించినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ఉన్న భారతీయ ప్రవాస సమాజం భద్రతపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ ప్రాంతానికి రవాణా చేసే భారతీయ ప్రయాణికులు, షెడ్యూల్డ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చర్చించింది. అలాగే ప్రాంతీయ భద్రత, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలపై విస్తృత ప్రభావాలను కూడా కమిటీ సమీక్షించింది. ఈ పరిణామాల వల్ల ప్రభావితమైన భారతీయ పౌరులకు సహాయం చేయడానికి అవసరమైన సాధ్యమయ్యే చర్యలు తీసుకోవాలని సంబంధిత అన్ని విభాగాలను ఆదేశించింది. శత్రుత్వాలను త్వరగా నిలిపివేసి చర్చలు దౌత్యానికి తిరిగి రావాలని పేర్కొంది.

విశ్వ వీక్షణం



శిశిరానికి వీడ్కోలు పలుకుతూ.. చిగురించే పచ్చని వసంతానికి స్వాగతం చెబుతూ.. ఆనందోత్సాహాలతో జరుపుకునే రంగుల పండుగే హోలీ.. ఈ పండుగ వచ్చిందంటే యువకులు, పిల్లలు, మహిళలు.. ఇలా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ, పూసుకుంటూ ఆనందంగా గడుపుతారు. గ్రామీణ ప్రాంతాల్లో వారం రోజుల ముందు నుంచే పండుగ వాతావరణం నెలకొంటుంది. ఆడపడుచుల ఆటపాటలు, చిన్నపిల్లల జాజర పాటలతో గ్రామాలు మార్మోగుతుంటాయి.

రంగేళీ హోలీ..

హంగామా కేళీ..

పండుగల్లో హోలీకి విశిష్టమైన స్థానం ఉంది. వసంత రుతువు ఆగమనానికి చిహ్నం ఈ పండుగ. ఈ రుతువులోనే చెట్ల ఆకులు రాలి కొత్త ఆకులు వస్తాయి. ప్రేమానురాగాలకు ప్రతీకగా, నూతన ఒరవడిని గుర్తు చేస్తూ వివిధ వర్గాల ప్రజలు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించుకునే పండుగ ఇది.

హోలికా దహనం

వైష్ణవములో రాక్షసరాజు హిరణ్యకశపుడు.. కుమారుడు ప్రహ్లాదుడు నిత్యం విష్ణుమూర్తిని స్మరిస్తూ ఉంటాడు. అది హిరణ్యకశపుడికి నచ్చకపోవడంతో భక్త ప్రహ్లాదుడిని చంపాలని అనుకుంటాడు. తన సోదరి అయిన హోలికను పిలిచి.. ఆమెకు ఉన్నశక్తితో భక్త ప్రహ్లాదుడిని మంటలతో ఆహుతి చేయమని కోరతాడు. దీంతో ఆమె భక్త ప్రహ్లాదుడిని ఒడిలో కూర్చోబెట్టుకొని మంటల్లోకి దూకుతుంది. విష్ణు మాయతో భక్త ప్రహ్లాదుడు బయటపడతాడు.. హోలిక రాక్షసి మాత్రం మంటల్లో చిక్కుకొని చనిపోతుంది. ఇక ఆమె దహనమైన రోజునే హోలీ పండుగగా పిలుస్తారని ప్రచారంలో ఉన్నది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో హోలిక దహనం చేస్తుంటారు.

కాముని పున్నమి

సతీవియోగంతో తపస్సులో ఉన్న శివునికి హిమవంతుని కుమార్తె అయిన పార్వతిని ఇచ్చి దేవతలు వివాహం చేయాలనుకుంటారు. కానీ తపస్సులో ఉన్న శివునికి ఎలా తపో భంగం కలిగించాలోనని ఆలోచించి మన్మథున్ని శివుని మీదకు పంపుతారు. కామదేవుడు శివుని తపస్సును భగ్నం చేసేందుకు పూల బాణాలు వదలడంతో శివుని మనస్సు పెండ్లి వైపు మరలిస్తాడు. దీంతో పార్వతీ పరమేశ్వరుల వివాహం జరుగుతుంది. మన్మథ బాణం ప్రభావం తగ్గగానే శివుడు తనకు మన్మథుడి వల్ల తపో భంగం కలిగిందని తన మూడో నేత్రంతో కామదేవుడిని భస్మం చేస్తాడు. పతీ వియోగంతో కామదేవుడి భార్య రతీదేవి శివునితో తన భర్త కామదేవున్ని బతికించమని వేడుకుంటుంది. శివుడు అనుగ్రహించి శరీరం లేకుండా మానసికంగా బతికే వరాన్ని ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ప్రసాదిస్తాడు. కాముడు తిరిగి బతికిన రోజు కావడంతో కాముని పున్నమిగా పిలుస్తారు.



రాధాకృష్ణులు

హోలీ వెనక మరో కథ కూడా ప్రచారంలో ఉంది. కృష్ణ భగవానుణ్ణి రాధ మరియు కొంత మంది స్త్రీలు నల్లవాడు మా కృష్ణుడు అని వెక్కిరించడంతో కృష్ణుడు చిన్నబుచ్చుకుని ఈ విషయాన్ని తన తల్లికి చెప్పాడు. అందుకు యశోధ స్పందించి రాధకు రంగు పూయమని చెప్పింది. అప్పుడు కృష్ణుడు, రాధకు రంగు పూయడంతో.. ఆమె మురిసిపోయి.. తనకు పూసిన రంగును చేతులకు అంటించుకుని కృష్ణుడికి పూసింది. రాధే కాదు.. గోపికలు కూడా వీరితో కలిసి ఈ రంగుల ఉత్సవాన్ని జరుపుకున్నారు. అప్పటినుండీ బృందావనంలోని వారు హోలీని జరుపుకోవడం మొదలుపెట్టారు. ఇప్పటికీ కృష్ణలీలలతో ముడిపడి ఉన్న బృందావన్, మధుర, బరసానా వంటి పుణ్యక్షేత్రాలలో హోలీని ఘనంగా జరుపుతారు. హోలీ రోజున రాధాకృష్ణులను ఊరేగించడం కూడా ఉత్తరభారత దేశంలో చూడవచ్చు. హోలీ తరువాత వచ్చే పంచమినాటి వరకూ కూడా ఈ సంబరాలు సాగుతాయి. ఇక శాస్త్రీయ కారణాలను ప్రస్తావిస్తే వసంతకాలంలో చలి పోయి వేడి గాలులతో వాతావరణం మారిపోతుంది. దీనివల్ల వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు వంటివి చుట్టుముడుతుంటాయి. హోలీ రోజున ఔషధ గుణాలున్న ఆకులు, పూలు, బెరడు, కాయలు, పండ్లతో చేసిన రంగులతో ఆడితే వ్యాధినిరోధక శక్తి పెరిగి, ఏ జబ్బులూ దరిచేరవని చెబుతారు. కాలక్రమంలో కృత్రిమ రంగులు వచ్చాయి కానీ.. మునుపు అందరూ సహజ రంగులకే ప్రాధాన్యం ఇచ్చేవారు. కానీ నేటితరానికి ఆరోగ్య స్పృహ పెరగడంతో సహజ రంగుల్నే నేటితరం ఇష్టపడుతోంది.

ఈ తండాలో హోలీ మూడు రోజులు

గిరిజనులకు హోలీ ప్రత్యేకమైన పండుగ. ఎక్కడున్నా హోలీ రోజు మాత్రం ఊళ్లకు వెళ్లి వేడుకలను జరుపుకుంటారు గిరిజనులు. ఈ పండుగ వారి సంప్రదాయాలకు నిలువుటద్దం. అందులోనూ ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలోని లోక్యతండాలో జరిగే హోలీ ఉత్సవాలు మరీ ప్రత్యేకం.. హోలీ ఎక్కడైనా ఒకరోజో, రెండు రోజులో జరుపుకునే పండుగ. ఇక్కడ మాత్రం హోలీ వేడుకలు మూడు రోజుల పాటు జరుగుతాయి. అంతేకాదు ఇలా ఈ వేడుకలు వందేళ్ల నుంచి జరగడం విశేషం. మొదటిరోజు కోలాటం, రెండో రోజు కామదహనం, మూడో రోజు రంగోలీ ఉత్సవాలు చేస్తారు.

కోలాటం

ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు 'హోలిలీ దండా మారే బాయ్ బయ్‌రే' కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఊరంతా పంచాయితీ కార్యాలయం దగ్గరకు వస్తారు. తరువాత కుల పెద్దలు 'గెరియా.. ఖారోబారో' కోలాటం కార్యక్రమాన్ని డప్పు వాయిద్యంతో మొదలు పెడతారు. ఐదు గంటలపాటు కోలాటం ఆడతారు.

లోక్యాతండాలో కాసేపు కోలాటం ఆడిన తరువాత అక్కడి నుంచి దగ్గరలోని జగ్నల్ తండాకు వెళతారు. అక్కడ కూడా కోలాటం ఆడి కార్యక్రమాన్ని ముగిస్తారు. కోలాటం చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు.



కామదహనం

రెండో రోజు కామదహనం నిర్వహిస్తారు. రాత్రి రెండు గంటలకు ఈ వేడుక మొదలవుతుంది. ముందురోజు రాత్రి తండాలోని ప్రతి ఇంటి నుంచి కట్టెలు తీసుకొస్తారు. వాటిని కామదహనం చేసే చోట కుప్పగా పేరుస్తారు. కుల పెద్దలు ఈ కుప్ప చుట్టూ తిరిగి పూజలు చేస్తారు. తరువాత కామదహనం చేస్తారు. ఇక్కడ మరో ప్రత్యేకత ఏంటంటే.. ఈ తండాలో పుట్టిన మగ పిల్లలను కామదహనం చేసే దగ్గరకు తీసుకొచ్చి కాముడి ఆశీర్వాదం అందేలా చేస్తారు. పిల్లలకు బొట్టు పెట్టించి ఇళ్లకు తీసుకెళ్తారు. పెళ్లీడుకొచ్చిన అమ్మాయిలు మంచి భర్త రావాలని పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. తరువాత తండావాసులు కామదహం మంట చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ఇక యువకులు 'చెర్రీ' అంటూ చేసే సందడి అంతా ఇంతా కాదు. ఇక ఈ రోజు చేసే మరో ప్రధాన ఘట్టం 'డూండ్'. తండాలో మగబిడ్డ పుట్టిన ఇళ్లలో ఈ వేడుక చేస్తారు. ఈ వేడుకలో బిడ్డకు అన్నప్రాసన చేస్తారు. గిరిజన సంప్రదాయంలో భాగమైన ఈ వేడుకకు ఆ ఇంటి బంధువులు అంతా వస్తారు. గ్రామ పెద్దలు గెరియా, ఖారోబారో ఆ ఇంటికి వచ్చి కోలాటం మొదలు పెట్టి అన్నప్రాసన వేడుకను మొదలు పెడతారు. తరువాత పాయసం ఉట్టిగొట్టే కార్యక్రమం ఉంటుంది.



రంగోలీ

ఇది మూడో రోజు చేసుకునే వేడుక.. అదే రంగోలీ.. దీన్ని గిరిజనులు 'పాగ్రామభరో' అని పిలుస్తారు. రెండు రోజుల పాటు దైవ భక్తితో వేడుకలు చేసుకునే తండావాసులు మూడోరోజు రంగోలీ వేడుకలు చేసుకుంటారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఒకేచోట చేరి రంగులు చల్లుకుంటారు. దీంతో హోలీ వేడుకలు ముగుస్తాయి.



గల్ఫ్ లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 2: విదేశాల్లో చదువుకుంటున్న మొత్తం భారతీయ విద్యార్థుల్లో పావు వంతు మంది గల్ఫ్ దేశాల్లోనే ఉన్నారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతున్న దరిమిలా ఈ విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడే అవకాశమే గాకుండా వారంతా భద్రతాపరమైన ముప్పును కూడా ఎదుర్కొంటున్నారు. 2025 నాటి లెక్కల ప్రకారం 150 దేశాల వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, స్కూళ్లలో 18.80 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. పశ్చిమాసియాలో పావు వంతుమంది అంటే దాదాపు 5 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. 90 లక్షల మంది భారతీయులు నివసిస్తున్న ఈ ప్రాంతంలో అనేక స్కూళ్లు భారతీయులకు అనుగుణంగా ఉండే సిలబస్‌నే బోధించడంతో భారతీయ విద్యార్థులు ఈ ప్రాంతాన్ని ఎంచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం అత్యధికంగా 2,53,832 మంది భారతీయ విద్యార్థులు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో చదువుకుంటుండగా, తర్వాత స్థానాల్లో వరుసగా సౌదీ అరేబియా(75,830), కువైట్ (50,000), ఖతార్ (49,346), ఒమన్ (44,847) ఉన్నాయి. బహ్రెయిన్ (28,620), ఇజ్రాయెల్ (900)ని కూడా కలుపుకొంటే ప్రస్తుత యుద్ధానికి ప్రభావితమైన దేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థుల సంఖ్య దాదాపు 5 లక్షల వరకు ఉండవచ్చని తెలుస్తున్నది. వీరుగాక ఉద్యోగ నిమిత్తం గల్ఫ్ దేశాలకు వచ్చి స్థిరపడిన భారతీయుల సంఖ్య అదనం. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో మార్చి 2న పశ్చిమాసియాలో జరుగవలసి ఉన్న 10వ తరగతి, 12వ తరగతి బోర్డు పరీక్షలను సీబీఎస్ఈ వాయిదావేసింది.



ఏఐ ఆధారిత నకిలీ తీర్పులతో నిర్ణయాలా..?

- కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీం కోర్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 2: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత నకిలీ కోర్టు తీర్పుల్ని ఓ ట్రయల్ కోర్టు పరిగణలోకి తీసుకోవటం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. 'ఉనికిలో లేని ఏఐ ఆధారిత నకిలీ తీర్పులతో కోర్టులు నిర్ణయాలు తీసుకోవటం తప్పు మాత్రమే కాదు. ఇది తీవ్రమైన దుష్ప్రవర్తన, చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది' అంటూ సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశాన్ని సవివరంగా పరిశీలించి ఏజీ ఆర్ వెంటకరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలకు నోటీసులు పంపుతామని తెలిపింది. ఈ అంశంలో సుప్రీంకోర్టుకు సహకరించేందుకు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్‌ను నియమించింది.



ఖమేని మృతిపై భారత్ లో నిరసనలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 2: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి పట్ల ఆదివారం భారత్‌లో తీవ్ర ఆగ్రహం, సంతాపం వ్యక్తమైంది. కశ్మీర్ మొదలుకొని కర్ణాటక వరకు పలు రాష్ట్రాల్లో షియా ముస్లింలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. 15 లక్షల షియా ముస్లింలు ఉన్న కశ్మీర్‌లోని శ్రీనగర్, బుద్గాం, బందిపొరా, అనంత్‌నాగ్, పుల్వామాలో షియాలు గుండెల మీద బాదుకొంటూ వీధుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇరాన్‌లోని తాజా పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకారులు శాంతియుతంగా ఆందోళన చేయాలని కోరారు. యూపీలోని లక్నో, అజ్మీర్‌లోనూ నిరసనలు చోటు చేసుకున్నాయి. కర్ణాటకలో 1986లో ఖమేనీ సందర్శించిన ఓ గ్రామంలో స్వచ్ఛందంగా దుకాణదారులు షాపులను మూసివేశారు. మూడు రోజులు సంతాప దినాలుగా పాటించాలని గ్రామస్థులు నిర్ణయించారు. న్యూఢిల్లీ, బీహార్, జార్ఖండ్, తెలంగాణలో తీవ్ర ఆందోళనలు, నినాదాల దృశ్యాలు కనిపించాయి.



350కి పైగా విమానాలు రద్దు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 2: పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా భారత్‌గల్ఫ్ దేశాల మధ్య విమాన రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సోమవారం ఒక్కరోజే 350కి పైగా అంతర్జాతీయ విమాన సర్వీసుల్ని భారత విమానయాన సంస్థలు రద్దు చేయాల్సి వచ్చింది. విమానయాన సేవల్లో తీవ్ర అంతరాయం మూడవ రోజు కూడా కొనసాగినట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇండిగో 163, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 110, స్పైస్‌జెట్ 20, ఆకాశా ఎయిర్ 8..ఫ్లైట్ సర్వీసుల్ని నిలిపివేశాయి. దీంట్లో ఒమన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్‌ల నుంచి ఉత్తర అమెరికా, యూరప్‌నకు ఎయిరిండియా నడుపుతున్న 20 ఫ్లైట్స్ ఉన్నాయి. మంగళవారం నాడూ పెద్ద సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం కనిపిస్తున్నది. భారత్ నుంచి అబుదాబి, దోహా, జెడ్డా, కువైట్, రియాద్‌లకు రాకపోకలు సాగించే తమ విమాన సర్వీసుల్ని రద్దు చేసినట్టు 'ఆకాశా ఎయిర్' ఇప్పటికే తెలిపింది.





అతని వల్లే మ్యాచ్ గెలిచాం

కోచ్ గౌతమ్ గంభీర్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూ ఆర్ డై సూపర్ 8 మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే సంజూ శాంసన్‌తో పాటు మ్యాచ్ చివర్లో శివమ్ దూబే కొట్టిన రెండు బౌండరీలు కూడా భారత విజయంలో కీలక పాత్ర పోషించాయని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తీవ్ర ఒత్తిడిలో దూబే ఆ రెండు బౌండరీ కొట్టకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని చెప్పాడు. భారత విజయంలో సంజూ ఇన్నింగ్స్ ఎంత పాత్ర పోషించిందో.. శివమ్ దూబే బౌండరీలకు అంతే విలువ ఉందని గంభీర్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్.. శివమ్ దూబే బ్యాటింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'మనం కొన్ని ప్రత్యేకమైన సహకారాల గురించి మాట్లాడుకుందాం. శివం దూబే కొట్టిన ఆ రెండు బౌండరీలు.. సంజూ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌తో సమానమని నేను భావిస్తున్నాను. ఇది ఒక టీమ్ గేమ్. కాబట్టి ఆ రెండు బౌండరీలు సంజూ ఇన్నింగ్స్ అంత కీలకం. ఎందుకంటే ఈ మ్యాచ్ లో భారత్ గెలవకపోయి ఉంటే.. సంజూ ఇన్నింగ్స్ గురించి ఎవరూ మాట్లాడుకునేవాళ్లు కాదు. సంజూ శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కానీ జట్టు గెలవడానికి ఇలాంటి చిన్న చిన్న సహకారాలే సహాయపడతాయి. పెద్ద స్కోర్లు హెడ్‌లైన్స్‌లో నిలుస్తాయి, కానీ జట్టు గెలుపు గీత దాటడానికి దోహదపడే ఇలాంటి చిన్న సహకారాలే చాలా కీలకం. నేను హెడ్ కోచ్‌గా ఉన్నంత కాలం ఇదే మా ఫిలాసఫీగా ఉంటుంది.' అని గంభీర్ స్పష్టం చేశాడు.



యుద్ధం కారణంగా కీలక టోర్నీకి సింధూ దూరం

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు కీలక టోర్నీకి దూరం కానుంది. ఇరాన్ క్షిపణుల దాడులతో వణికిపోతున్న దుబాయ్‌కు విమాన రాకపోకలు నిలిచిపోయన నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ లో సింధు ఆడడంపై సందేహాలు నెలకొలన్నాయి. ఈ ఏడాదైన టైటిల్ లో మురవాలనుకున్న తెలుగు తేజం కలలు కల్లలయ్యేలా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో భారత బృందానికి లక్ష్య సేన్ సారథ్యం వహించే అవకాశముంది. బ్యాడ్మింటన్ ఆటలో ఆల్ ఇంగ్లండ్ టోర్నమెంట్ చాలా ప్రసిద్ధి. ఈసారి బర్మింగ్‌హమ్ వేదికగా మార్చి 3వ తేదీ నుంచి ఈ సూపర్ 1000 టోర్నీ ప్రారంభమవ్వనుంది. మంగళవారం నుంచే ఈవెంట్ షురూ కానున్నందున భారత బృందంలోని పలువురు ఇంగ్లండ్ చేరుకున్నారు. పురుషుల సింగిల్స్ స్టార్ లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి.. డబుల్స్ ద్వయం సాత్విక్ - చిరాగ్.. మిక్స్‌డ్ డబుల్స్ ప్లేయర్లు ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టో.. రోహన్ కపూర్, రుత్వికా శివాని గద్దెలు కొందరు ఇతర మార్గాల్లో(ఆఫ్రికా, సింగపూర్ మీదుగా) బర్మింగ్‌హమ్‌లో దిగారు. సింధు మాత్రం కోచ్ ఇర్వన్‌స్యాహ్ అది ప్రటమాన్ సహా దుబాయ్‌లో చిక్కుకుపోయింది. గల్ఫ్‌లో యుద్ధం తీవ్రతతో నెలకొలన్న పరిస్థితుల వల్ల తాము సురక్షిత ప్రదేశంలో ఉన్నామని, ఇక్కడ భయానక పరిస్థితులు ఉన్నాయని ఆమె ఎక్స్ పోస్ట్‌తో తాను దుబాయ్‌లోనే ఉండిపోయాననే విషయాన్ని పంచుకుంది. ఇరాన్ క్షిపణుల దాడుల కారణంగా దుబాయ్ గగనతలాన్ని మూసేయడంతో విమాన రాకపోకలు నిలిచిపోయాయి. దాంతో.. తెలుగు తేజం ఆల్ ఇంగ్లండ్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఇంగ్లండ్‌కు వెళ్లలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య దుబాయ్‌లోని పరిస్థితులను క్షుణ్ణంగా గమనిస్తోంది. సింధు సహా అక్కడ చిక్కుకుపోయిన క్రీడాకారులను ఇతర మార్గాల్లో సురక్షింతగా తరలించేందుకు ప్రయత్నిస్తోంది. తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్ షట్లర్ సుపానిద కటేథోంగ్‌తో సింధు తలపడాల్సింది. కానీ, ప్రస్తుతం తను టోర్నీ సమయానికి ఇంగ్లండ్ చేరకుంటుందా? అంటే.. ఔనని కచ్చితంగా చెప్పలేం.



పాక్ ప్లేయర్లపై 17 లక్షల జరిమానా

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కఠిన చర్య తీసుకున్నది. తాజాగా జరుగుతున్న టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ జట్టు సూపర్ 8 స్టేజ్ లోనే వైదొలిగిన విషయం తెలిసిందే. సెమీస్‌కు చేరకపోవడం పట్ల ఆ దేశ క్రికెట్ బోర్డు ఆగ్రహంగా ఉన్నది. ఈ నేపథ్యంలో ఆ దేశ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లకు జరిమానా విధించింది. భారీగా ఫైన్ వేసింది. కీలక ప్లేయర్లపై ఒక్కొక్కరికి సుమారు 5 మిలియన్ల పాకిస్థాన్ రూపాయల జరిమానా విధించింది. అంటే ఒక్కో ప్లేయర్ సుమారు 17 లక్షలు ఫైన్ కట్టాల్సి ఉంటుంది. టోర్నీలో ఏమాత్రం పర్ఫార్మెన్స్ చేయని క్రికెటర్లకు ఈశిక్ష పడినట్లు తెలుస్తోంది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్, పేస్ బౌలర్ షహీన్ అఫ్రీది, ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్‌పైన కూడా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జరిమానా విధించింది. తొలి రౌండ్‌లో ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో సరైన ఆటతీరును ప్రదర్శించని క్రికెటర్లకు ఈ జరిమానా వేసినట్లు తెలుస్తోంది. చెత్త పర్ఫార్మెన్స్‌ను ఏమాత్రం సహించేది లేదని పీసీబీ వెల్లడించింది. భవిష్యత్తులో మెరుగైన ఆటను ప్రదర్శించిన క్రికెటర్లకు మాత్రమే ప్రోత్సాహకాలు ఉంటాయని పీసీబీ చెప్పింది.



గుకేశ్ కు నిరాశ

ప్రేగ్ ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్స్‌లో తొలి విజయం కోసం వేచిచూస్తున్న వరల్డ్ చాంపియన్ డి. గుకేశ్‌కు నాలుగో రౌండ్‌లోనే నిరాశే ఎదురైంది. నాలుగో రౌండ్‌లో అతడు.. డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. తొమ్మిది రౌండ్లుగా జరుగబోయే ఈ టోర్నీలో జోర్డెన్ (హాలండ్) నాలుగు గేమ్‌ల్లో మూడు గెలిచి 3 పాయింట్లతో అగ్రస్థానాన కొనసాగుతున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ అరవింద్ చిదంబరం నాలుగో రౌండ్‌లో విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు.

మన శంకరవరప్రసాద్ గారు రికార్డు

మెగాస్టార్ చిరంజీవి మరోసారి తాను మాస్-ఫ్యామిలీ ఎంటర్టైనర్లలో తిరుగులేని రాజు అని నిరూపించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్‌పై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల నిర్మించిన ఆయన లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మన శంకరవరప్రసాద్ గారు బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడమే కాకుండా, ఈ రోజుల్లో చాలా అరుదుగా కనిపించే 50 రోజుల థియేట్రికల్ రన్ సాధించింది. ప్రస్తుతం ఓటీటీ ప్రభావంతో థియేటర్ రన్స్ తగ్గిపోతున్న పరిస్థితుల్లో కూడా, జీ5లో విడుదలైన తర్వాత కూడా ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను అలరించింది. ఓటీటీ ప్లాట్‌ఫారమ్ లో కూడా ఆల్‌టైమ్ బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచి, పలు భాషల్లో నెంబర్ 1 ట్రెండింగ్‌గా కొనసాగడం ప్రజాదరణకు నిదర్శనం. ఈ చిత్రం రీజినల్ స్థాయిలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. చిరంజీవి, అనిల్ రావిపూడి కెరీర్‌లో తొలి 400 కోట్ల బ్లాక్‌బస్టర్‌గా రికార్డు సృష్టించింది. ఉత్తర అమెరికాలో దాదాపు 3.5 మిలియన్ డాలర్ల వసూళ్లు సాధించి గ్లోబల్ మార్కెట్‌లో కూడా తన పవర్ ని చాటింది. అలాగే బుక్‌మైషోలో 3.8 మిలియన్లకు పైగా టికెట్లు అమ్ముడవడం రీజినల్ సినిమాల్లో హయ్యస్ట్ రికార్డ్. ఈ విజయానికి ప్రధాన కారణం చిరంజీవి రిఫ్రెషింగ్, ఎనర్జిటిక్ అవతార్. ఆయన లైవ్లీ ఎక్స్‌ప్రెషన్స్, యూత్‌ఫుల్ ఎనర్జీ, అద్భుతమైన కామిక్ టైమింగ్ ప్రేక్షకులను మళ్లీ గోల్డెన్ ఎరా గుర్తు చేస్తూ అలరించారు. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కు పేరుపొందిన అనిల్ రావిపూడి మరోసారి అన్ని వయస్సుల ప్రేక్షకులను ఆకట్టుకునే క్లాసిక్‌ను అందించారు. పండుగ సీజన్‌లో ఫ్యామిలీస్ మెయిన్ చాయిస్ గా నిలిచిన ఈ చిత్రం ఫీల్ గుడ్ నేరేటివ్‌తో ప్రత్యేక స్థానం సంపాదించింది.






విశ్వనాథ్ & సన్స్


ఫస్ట్ లుక్.. త్వరలోనే టీజర్ విడుదల

సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న 'సూర్య 46' చిత్రానికి 'విశ్వనాథ్ & సన్స్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పేరు విన్న తక్షణమే ఒక క్లాసీ, స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రాన్ని చూడబోతున్నామని స్పష్టమవుతోంది. సూర్య ఒక చిన్నారితో కలిసి కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు.. మధుర జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, సూర్యలోని పాతకాలపు మాధుర్యాన్ని మళ్లీ తెరపై చూపిస్తూ ప్రేక్షకులకు అందమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. భారీ స్థాయి కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మమిత బైజు, రాధిక శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సార్/వాతి', 'లక్కీ భాస్కర్' వంటి వరుస విజయాలతో దూసుకుపోతున్న బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గొప్ప కథకుడిగా, భావోద్వేగాలతో కూడిన రచనకు పేరుగాంచిన ఆయన, ఈ సినిమాతో మరో చిరస్మరణీయ అనుభూతిని అందించనున్నారు. విజయవంతంగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'విశ్వనాథ్ & సన్స్', జూలైలో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు, ఉత్సాహం నెలకొనగా.. వాటిని రెట్టింపు చేసేలా త్వరలోనే టీజర్ విడుదల కానుంది. ప్రేక్షకులను గొప్ప సినీ అనుభూతిని అందించడం కోసం అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఛాయాగ్రాహకుడిగా నిమిష్ రవి వ్యవహరిస్తున్నారు. ఎడిటింగ్ బాధ్యతలను నవీన్ నూలి నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడిగా బంగ్లాన్ వ్యవహరిస్తున్నారు. సమష్టి కృషితో ప్రేక్షకులను కథలో లీనం చేసే గొప్ప ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరిస్తున్నారు.

'విష్ణు విన్యాసం' తొలి వీకెండ్‌లో రూ.14.7 కోట్ల గ్రాస్ కలెక్షన్స్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు లేటెస్ట్ బ్లాక్ బస్టర్ విష్ణు విన్యాసం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లు సాధిస్తోంది. ఓపెనింగ్ వీకెండ్ స్థిరంగా పెరుగుతూ వచ్చిన ఈ సినిమా మంచి పబ్లిక్ టాక్‌తో స్ట్రాంగ్ కమర్షియల్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. మొదటి రెండు రోజుల్లోనే మంచి గ్రోత్ నమోదు చేసిన ఈ చిత్రం, మూడో రోజునే రూ.5.6 కోట్ల గ్రాస్ సాధించింది. వరల్డ్‌వైడ్ తొలి వీకెండ్ కలెక్షన్స్ రూ.14.7 కోట్లకు చేరాయి. విడుదల అనంతరం వచ్చిన పాజిటివ్ పబ్లిక్ టాక్ ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది.





'ధర్మస్థల నియోజకవర్గం'.. ఈ వారంలోనే ఫస్ట్ సింగిల్ విడుదల

మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రంతో ప్రముఖ డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రానికి సంబంధించి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. 'న్యాయం చేయరా దేవుడా..' అంటూ వర్మ డ్యాన్స్ నెంబర్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ వారంలోనే ఈ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. ఒక డిఫరెంట్ పొలిటికల్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్రంలో సీనియర్ నటులైన సాయికుమార్, సుమన్‌లతో పాటు యంగ్ హీరోస్ కూడా నటిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు లేని విధంగా.. డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఈ చిత్రంలో ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. ఆమె ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ కానున్నారు. 'న్యాయం చేయరా దేవుడా..' లిరికల్ సాంగ్‌తో మ్యూజిక్ ప్రమోషన్స్‌ని మొదలు పెట్టబోతున్నాం. ఈ సాంగ్‌లో శ్రష్టి వర్మ స్టెప్స్ అందరినీ కనువిందు చేయనున్నాయి. ఈ వారంలోనే సాంగ్‌ని రిలీజ్ చేయనున్నాం. ప్రేక్షకులకు థ్రిల్ ఇచ్చేలా ఉత్కంఠ భరితమైన సన్నివేశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం జరిగింది. ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ అందించిన లిరిక్స్, స్టార్ సింగర్ సునీత ఆలపించిన పాటలు ఈ చిత్రానికి మరో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనున్నాయి. అన్ని హంగులతో ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేయనున్నాం. మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తాం" అని తెలిపారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200